సంపుటి : 9
సంచిక : 330
శనివారం
22 ఆగస్టు 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

# విశ్వం వాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE






Contact For Ads:
7579339999


వన్యప్రాణుల కదలికల గుర్తింపు..

## భక్తుల భద్రతే లక్ష్యం



**తిరుమల, ఆగస్టు 21, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల కదలికలను నిరంతరం కనిపెడుతూ, భక్తు లకు పూర్తి రక్షణ కల్పించేందుకు తిరుమల తిరుపతి దేవ స్థానం (తితిదే) నూతన సాంకేతికతను అందుబాటులోకి తెస్తోంది. మనుషులు వెళ్లడానికి వీలులేని కొండకోనల్లోనూ సునాయాసంగా తిరుగుతూ సమాచారాన్ని అందించే 'నాలుగు కాళ్ల యంత్ర శునకాన్ని' (రోబో డాగ్) ప్రయోగాత్మకంగా పరిశీలిస్తోంది. తిరుమలలోని పద్మావతి అతిథి గృహం వద్ద తితిదేదనపు ఈవో వెంకయ్య చౌదరి గురువారం ఈ రోబో పనితీరును పరిశీలించి ప్రశంసించారు.

**ఈ రోబో డాగ్ ప్రత్యేకతలు:**

**ప్రతికూల వాతావరణంలోనూ:** రాళ్లు, మెట్లు ఉన్న దారులతో పాటు మిగతా .. 2లో..



## నాకు స్వాగతం పలుకుతున్నారేమో అనుకున్నా!

తొలి రోజు అనుభవం ఒక పీడకల

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా టీడీపీ సీనియర్ నేత వర్ల రామయ్య ఆవేదన

**అమరావతి, ఆగస్టు 21, విశ్వం వాయిస్ న్యూస్ :** శాసనమండలిలో తన తొలిరోజు అనుభవం ఓ పీడకలలా మిగిలిపోయిందని, పెద్దల సభలో వైసీపీ సభ్యులు "పెద్దల్లా" కాకుండా "గద్దల్లా" వ్యవహరించి సభా గౌరవాన్ని మంటగలిపారని నూతన ఎమ్మెల్సీ, టీడీపీ సీనియర్ నేత వర్ల రామయ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై చర్చించి, చట్టాలను సమీక్షించాల్సిన మండలిలో నినాదాలు, గందరగోళంతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. శుక్రవారం మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కౌన్సిల్‌లో వైసీపీ సభ్యుల తీరు తనను తీవ్ర నిరుత్సాహానికి గురిచేసిందన్నారు. ముందుగా, తనను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎంపిక చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఆమోదం తెలిపిన గవర్నర్‌కు వర్ల రామయ్య కృతజ్ఞతలు తెలిపారు. తాను ప్రమాణ స్వీకారం చేసిన రోజు సభ వాయిదా పడగా, ఎమ్మెల్సీగా కార్యకలాపాల్లో పాల్గొనేందుకు నిన్న తొలిసారి సభలో అడుగుపెట్టానని చెప్పారు. "సభలోకి అడుగుపెట్టగానే పెద్ద ఎత్తున గందరగోళం కనిపించింది. కొత్త సభ్యుడిగా నాకు స్వాగతం పలుకుతున్నారేమో అని తొలుత భావించాను. కానీ, కాసేపటికే వైసీపీ సభ్యులు సభా కార్యక్రమాలను అడ్డుకుంటున్నారని అర్థమైంది. ఛైర్మన్ మోషేన్ రాజు ఆసీనులై ఉండగా, ఆయనకు ఇరువైపులా నిలబడి, ముఖానికి అడ్డంగా ప్లకార్డులు పెట్టి, మైక్రోఫోన్ లాక్కొని పెద్దగా నినాదాలు చేశారు. వారి ప్రవర్తన చూసి తీవ్రంగా కలత చెందాను" అని తన తొలిరోజు అనుభవాన్ని వివరించారు.

**దళిత ఛైర్మన్‌ను అవమానిస్తున్నారు**

దళిత వర్గానికి చెందిన ఛైర్మన్ మోషేన్ రాజును వైసీపీ సభ్యులు ఉద్దేశపూర్వకంగా అవమానిస్తున్నా రని రామయ్య ఆరోపించారు. "ఒక దళిత నాయ కుడు ఆ స్థానంలో కూర్చొని సభను నడపడం వారికి ఇష్టం లేదా? ఆయన వయసును, హోదాను కూడా గౌరవించడం లేదు. ఇది పెద్దల సభ ఔన్నత్యాన్ని దెబ్బతీయడమే. పెద్దరికం మిగతా .. 2లో..

## అంతరిక్ష రంగ స్టార్టప్‌లతో మోదీ భేటీ

యువ పారిశ్రామికవేత్తల కృషిని ప్రశంసించిన ప్రధాని

అంతరిక్ష సంస్కరణలతో కొత్త అవకాశాలు - స్టార్టప్‌లకు కేంద్రం పూర్తి మద్దతు



**న్యూఢిల్లీ, ఆగస్టు 21, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశ అంతరిక్ష రంగంలో ముందుకు వస్తున్న యువ పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలతో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. భారత అంతరిక్ష రంగానికి కొత్త ఊపును తీసుకొస్తున్న యువశక్తి కృషిని కొనియాడుతూ, భవిష్యత్తులో కూడా కేంద్ర ప్రభుత్వం వారికి పూర్తి మద్దతుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. అంతరిక్ష రంగంలో అడుగుపెట్టడం సవాళ్లతో కూడుకున్న విషయమని, అయినప్పటికీ యువ పారిశ్రామికవేత్తలు ధైర్యంగా ముందుకు వచ్చి తమ సామర్థ్యాన్ని నిరూపించుకున్నారని ప్రధాని పేర్కొన్నారు. సంస్కరణలపై విశ్వాసం ఉంచి, నిరంతర కృషితో ముందుకు సాగినందువల్లే గత కొన్ని సంవత్సరాల్లో భారత అంతరిక్ష రంగం గణనీయమైన విజయాలు సాధించిందన్నారు. ఈ సందర్భంగా వివిధ అంతరిక్ష స్టార్టప్‌లు తమ ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం, భవిష్యత్ ప్రణాళికలపై ప్రజెంటేషన్లు ఇచ్చాయి. తమ సంస్థలు అభివృద్ధి చెందడంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అంతరిక్ష సంస్కరణలు కీలక పాత్ర పోషించాయని స్టార్టప్ ప్రతినిధులు ప్రధానికి వివరించారు. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే విధానాలు కొత్త అవకాశాలను సృష్టించాయని మోదీ అన్నారు. యువత ప్రతిభ, సాంకేతిక నైపుణ్యాలు దేశాన్ని అంతరిక్ష పరిశ్రమలో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. భారత ప్రభుత్వం భవిష్యత్ సాంకేతిక సామర్థ్యాల నిర్మాణంలో స్టార్టప్‌లకు మిగతా .. 2లో..

## ప్రముఖ నటి షావుకారు జానకి కన్నుమూత

పాత్రల రూపంలో చిరస్థాయిగా నిలిచిపోతారన్న సీఎం చంద్రబాబు



**అమరావతి, ఆగస్టు 21, విశ్వం వాయిస్ న్యూస్ :** అలనాటి మేటి నటి షావుకారు జానకి (94) ఆకస్మిక మరణం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 400కు పైగా చిత్రాల్లో నటించి, ఎన్నో అవార్డులు పొందిన జానకి భౌతికంగా దూరమైనా, ఆమె పోషించిన పాత్రల ద్వారా ప్రేక్షకుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. షావుకారు జానకి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత షావుకారు జానకి శుక్రవారం చెన్నైలో తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా వయోభారంతో కూడిన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె, తన నివాసంలో కన్నుమూశారు. ఆమె మరణంతో దక్షిణ భారత సినీ పరిశ్రమలో ఒక శకం ముగిసినట్లయింది. 1931 డిసెంబర్ 12న రాజమండ్రిలో జన్మించిన శంకరమంచి జానకి, చిన్నతనంలోనే రేడియో కళాకారిణిగా ప్రస్థానం ప్రారంభించారు. 1950లో విడుదలైన 'షావుకారు' చిత్రంతో వెండితెరకు పరిచయమై, మిగతా .. 2లో..

భోగాపురం నుంచి విశాఖకు

## 45 నిమిషాల్లో చేరుకున్నా..

అనకాపల్లికి 1.10 గంటలు పట్టింది : నారా భువనేశ్వరి



**అమరావతి, ఆగస్టు 21, విశ్వం వాయిస్ న్యూస్ :** భోగా పురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విశాఖ నగరానికి 45 నిమిషాల్లో, అనకాపల్లికి 1.10 గంటల్లో చేరు కున్నట్టు సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి తెలిపారు. భోగా పురం నుంచి విశాఖ వెళ్లడానికి రెండు గంటలు సమయం పడుతోందని కొందరు చేస్తున్న వ్యాఖ్యలపై 'ఎక్స్' లో ఆమె శుక్ర వారం స్పందించారు. 'నా వ్యక్తిగత అనుభవాన్ని మీతో పంచుకో వాలనుకుంటున్నాను. భోగాపురం నుంచి విశాఖ, అనకాపల్లి వెళ్లడానికి రెండు గంటల కంటే మిగతా .. 2లో..

వివేకా హత్య కేసులో

## ఈడీ దర్యాప్తు ముమ్మరం

ఎంపీ అవినాశ్ రెడ్డి, ఆయన తండ్రి నివాసాల్లో సోదాలు

మనీ లాండరింగ్ కోణంలో ఏకకాలంలో 7 చోట్ల తనిఖీలు

కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలను సీజ్ చేసిన అధికారులు




**హైదరాబాద్, ఆగస్టు 21, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డితో పాటు మరికొందరి నివాసాలు, కార్యాలయాలపై శు క్రవారం ఈడీ అధికారులు మెరుపుదాడులు నిర్వహించారు. ఈడీ హైదరాబాద్ జోనల్ కార్యాలయ అధికారులు మనీ లాండరింగ్ మిగతా .. 2లో..

## దుర్గగుడి అన్నప్రసాద సదనం ప్రారంభం

అన్నదానం, ప్రసాదం తయారీకి రూ.52 కోట్లతో ప్రత్యేక భవనాలు



**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 21, విశ్వం వాయిస్ న్యూస్ :** విజ యవాడ దుర్గగుడికి అన్నదానం, ప్రసాదం తయారీకి ప్రత్యేక భవనాలు అందుబాటులోకి వచ్చాయి. శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో రూ.52.50 కోట్లతో నిర్మించిన కనకదుర్గ మిగతా .. 2లో..




దేశ సంప్రదాయాల పరిరక్షణలో

## యువత పాత్ర కీలకం

'పంచ పరివర్తన్'లో పర్యావరణానికి ప్రథమ ప్రాధాన్యం - ముగిసిన ఆరెస్సెస్ అఖిల భారతీయ సమన్వయ బైఠక్

**విశాఖపట్నం, ఆగస్టు 21, విశ్వం వాయిస్ న్యూస్ :** 'యువతలో సంస్కారం, సాంస్కృతిక విలువలను కేవలం ప్రసంగాలు, పోస్టర్ల ద్వారా నిర్మించలేం. ప్రత్యక్షంగా మాట్లాడి వారి భావాలను అర్థం చేసుకోవాలి. దేశ సంప్రదాయాల పరిరక్షణలో యువత పాత్ర కీలకం' అని అఖిల భారతీయ సహ సర్‌కార్యవాహ ముకుంద్ తెలిపారు. విశాఖ జిల్లా గుడిలోవలో ఆరెస్సెస్ అఖిల భారతీయ సమన్వయ బైఠక్ ముగింపు సందర్భంగా మీడియాతో శుక్రవారం ఆయన మాట్లాడారు. సమావేశాలకు మిగతా .. 2లో..



భారత్‌లో పర్యటనపై

## బంగ్లా ప్రధాని సందిగ్ధం



**ఆగస్టు 21, విశ్వం వాయిస్ న్యూస్ :** బంగ్లాదేశ్ ప్రధానమంత్రి తారిఖ్ రెహ మాన్ భారత పర్యటనకు సంబంధించి సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. ఈ నెల 23-25 తేదీల్లో ఆయన దిల్లీలో పర్యటించే అవకాశం ఉందని జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే బంగ్లా ప్రధాని కార్యాలయం స్పందిస్తూ.. తారిఖ్ పర్యటనపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని పేర్కొంది. మాజీ ప్రధాని షేక్ హసీనాతోపాటు ఇతర నేరస్థులను అప్పగించే విషయంలో భారత్ స్పందన కోసం మిగతా .. 2లో..

అందుకే సీఎం రేవంత్ అమెరికా పర్యటనకు

## అనుమతివ్వలేదు : కేంద్రం



**దిల్లీ, ఆగస్టు 21, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభు త్వం అనుమతి నిరాకరించిన విషయం తెలిసిందే. దీనిపై విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జయస్వాల్ స్పందించారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖుల విదేశీ పర్యటనలకు అనుమతి మంజూరు చేసే ముందు ఆ వివరాలను విదేశీ మిగతా .. 2లో..

హత్య కేసులో దోషి..

105 ఏళ్ల వృద్ధుడికి

## 'సుప్రీం' ఉపశమనం



**పశ్చిమ బెంగాల్, ఆగస్టు 21, విశ్వం వాయిస్ న్యూస్ :** హత్య కేసులో దోషిగా శిక్ష అనుభవిస్తున్న 105 ఏళ్ల వృద్ధుడికి దేశ అత్యున్నత న్యాయ స్థానం గొప్ప ఉపశమనం కలిగించింది. గతంలో మంజూరు చేసిన తాత్కాలిక పూచీకత్తునే (బెయిల్‌ను) ఆఖరి నిర్ణయంగా ప్రకటిస్తూ, అతడిని మళ్లీ కారాగారంలోకి తీసుకోకూడదని స్పష్టం చేసింది. ఇకపై ఆయన స్వేచ్ఛగా జీవించవచ్చని తీర్పునిచ్చింది.

**కేసు నేపథ్యం:**

పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా జిల్లాకు చెందిన రసిక్ చంద్ర మోండల్ (105) దాదాపు నలభై ఏళ్ల క్రితం ఒక హత్య కేసులో నిందితుడిగా చేరారు. 1994లో న్యాయస్థానం మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## భక్తుల భద్రతే లక్ష్యం

దట్టమైన పొగమంచులోనూ ఇది సులభంగా పయనిస్తుంది.

**ముందస్తు హెచ్చరికలు:** అటవీ ప్రాంతాల్లో చిరుతలు, ఇతర క్రూర మృగాలు కనిపిస్తే వెంటనే భద్రతా విభాగానికి ప్రత్యక్ష ప్రసారం (లైవ్ వీడియో) ద్వారా హెచ్చరికలు పంపుతుంది.

**జంతువులను వెనక్కి మళ్లించడం:** ఇందులో ఉండే కాంతి, శబ్ద పరికరాల ద్వారా క్రూర జంతువులను హాని తలపెట్టకుండా తిరిగి అడవిలోకి పంపవచ్చు.

చెన్నైకి చెందిన ఒక కొత్త తరం సంస్థ రూ.20-25 లక్షల విలువైన ఈ రోబోను రూపొందించింది. వచ్చే బ్రహ్మోత్సవాల సమయంలో దీని సేవలను వినియోగించుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

## అంతరిక్ష రంగ స్టార్టప్‌లతో మోదీ భేటీ

అండగా ఉంటుందని ప్రధాని స్పష్టం చేశారు. పరిశోధన, ఆవిష్కరణలు, వాణిజ్యపరమైన అవకాశాల విస్తరణలో అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రపంచానికి బలమైన, వినూత్నమైన, వాణిజ్యపరంగా విజయవంతమైన అంతరిక్ష నమూనాను అందించే సామర్థ్యం భారత్‌కు ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. యువత ఆధ్వర్యంలో భారత అంతరిక్ష రంగం మరిన్ని విజయాలను నమోదు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రముఖ నటి షావుకారు జానకి కన్నుమూత

ఆ సినిమా పేరునే తన ఇంటిపేరుగా మార్చుకున్నారు. దాదాపు ఏడు దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో తెలుగు, తమిళం సహా పలు భాషల్లో 385కు పైగా చిత్రాల్లో నటించి మెప్పించారు. కథానాయికగా 'పాండురంగ మహత్యం', 'చరణదాసి', 'భాగ్యరేఖ', 'మంచి మనసులు', 'డాక్టర్ చక్రవర్తి' వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించారు. ఆ తర్వాత 'సంసారం ఒక చదరంగం', 'గీతాంజలి', 'శుభాకాంక్షలు', 'మేడమ్' వంటి చిత్రాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా తనదైన నటనతో చెరగని ముద్ర వేశారు. 2023లో వచ్చిన 'అన్నీ మంచి శకునములే' ఆమె నటించిన చివరి చిత్రం. నటనకు ఆమె చేసిన సేవలకు గాను భారత ప్రభుత్వం 2022లో 'పద్మశ్రీ'తో సత్కరించింది. ఫిలింఫేర్ జీవన సాఫల్య పురస్కారం, ఎన్టీఆర్ జాతీయ అవార్డు వంటి ఎన్నో ప్రతిష్ఠాత్మక పురస్కారాలు ఆమెను వరించాయి. ఆమె సోదరి కృష్ణకుమారి కూడా అలనాటి ప్రముఖ హీరోయిన్ అని తెలిసిందే. షావుకారు జానకి మరణ వార్తతో సినీ ప్రముఖులు, అభిమానులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

## 45 నిమిషాల్లో చేరుకున్నా..

తక్కువ సమయమే పడుతోంది. అందరూ వెళ్లే మార్గంలోనే నేనూ ప్రయాణించాను. ప్రయాణికులు బయలుదేరే ప్రాంతం, ట్రాఫిక్ పరిస్థితులు, మార్గాన్ని బట్టి సమయం మారొచ్చు. కనెక్టివిటీ, మౌలిక సదుపాయాలు మెరుగుపడితే ప్రయాణం మరింత సులభతరంగా మారుతుంది. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఓ కీలక మైలురాయి' అని భువనేశ్వరి పేర్కొన్నారు.

## ఈడీ దర్యాప్తు ముమ్మరం

నిరోధక చట్టం కింద ఈ తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్, కడప జిల్లా పులివెందులలో కలిపి మొత్తం ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు జరిగాయి. హైదరాబాద్‌లోని కోకాపేటలో ఉన్న అవినాశ్ రెడ్డి విల్లా, పులివెందులలోని ఆయన నివాసంతో పాటు, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్ రెడ్డికి చెందిన పులివెందుల భాకరాపురంలోని ఇంట్లోనూ అధికారులు తనిఖీలు చేశారు. మొదట భాస్కర్ రెడ్డి ఇల్లు తాళం వేసి ఉండటంతో, బంధువులను పిలిపించి దానిని తెరిపించారు. వీరితో పాటు సీబీఐ చార్జ్‌షీట్‌లో పేర్లు ఉన్న దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి, యెర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, షేక్ దస్తగిరి నివాసాల్లో కూడా ఈడీ సోదాలు నిర్వహించింది. ఈ తనిఖీల సందర్భంగా పలు కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

### కేసు నేపథ్యం

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ కు బాబాయి అయిన వైఎస్ వివేకానంద రెడ్డి, 2019 మార్చి 15న పులివెందులలోని తన నివాసంలో హత్యకు గురయ్యారు. ఈ కేసును మొదట రాష్ట్ర పోలీసులు దర్యాప్తు చేయగా, 2020 మార్చిలో ఏపీ హైకోర్టు ఆదేశాలతో సీబీఐకి బదిలీ అయింది. ఈ హత్య వెనుక రూ. 40 కోట్ల సుపారీ కుట్ర ఉన్నట్లు అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడు. సీబీఐ దాఖలు చేసిన చార్జ్‌షీట్ల ఆధారంగా, ఈడీ మనీ లాండరింగ్ కోణంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. హత్యకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, నిధుల మళ్లింపుపైనే ఈడీ ప్రధానంగా దృష్టి సారించింది. తాజా సోదాలు ఈ దర్యాప్తులో కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

## దుర్గగుడి అన్నప్రసాద సదనం ప్రారంభం

అన్నప్రసాద భవనం, దుర్గాభవానీ మహాప్రసాద భవనాన్ని ఎంపీ కేశినేని శివనాథ్, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరితో కలిసి దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. నూతన భవనంలో ఒకేసారి 800 మంది కూర్చొని భోజనం చేసేలా ఏర్పాట్లు చేశారు. మంత్రి మాట్లాడుతూ ఇంద్రకీలాద్రిపై శాశ్వత ప్రాతిపదికన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. రెండో ఘాట్ రోడ్డును కుమ్మరిపాలెం నుంచి అమ్మవారి ఆలయానికి 700 మీటర్ల మేర నిర్మించేందుకు సాధ్యాసాధ్యాల నిర్ధారణను ఆర్అండ్‌బీ, కన్సల్టెన్సీ సంస్థ పరిశీలిస్తోందన్నారు. కుమ్మరిపాలెంలోని మూడెకరాల తితిదే స్థలంలో భక్తుల కోసం మల్టీలెవల్ బిల్డింగ్ నిర్మాణం, పార్కింగ్ సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. దుర్గాఘాట్ వద్ద శాశ్వత కేశఖండనశాల, ఘాట్ రోడ్డు మొదటి మలుపు వద్ద 25 అడుగుల ఆదిశంకరాచార్యుని విగ్రహం నిర్మించేందుకు ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్, దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ దినకర్, ఈవో శీనానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 'సుప్రీం' ఉపశమనం

ఆయనను దోషిగా తేల్చి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది.

వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న మోండల్, ముందస్తు విడుదల కోరుతూ 2020లో అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారించిన న్యాయస్థానం 2024 నవంబరులో ఆయనకు తాత్కాలిక పూచీకత్తు మంజూరు చేసింది. తాజాగా ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ఆయన వయసును పరిగణనలోకి తీసుకుని ఈ కేసును ముగిస్తున్నట్లు ప్రకటించింది. మిగిలిన శిక్షను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## నాకు స్వాగతం పలుకుతున్నారేమో అనుకున్నా!

వయసుతో రాదు, ప్రవర్తనతో వస్తుంది. 25 ఏళ్ల యువకుడు కూడా తన నడవడికతో పెద్దమనిషి అనిపించుకోవచ్చు. కానీ, మండలిలో వైసీపీ సభ్యుల తీరు అల్లరి మూకలను తలపిస్తోంది" అని మండిపడ్డారు.

### జగన్ ప్రోత్సాహంతోనే ఈ రచ్చ

ఈ గందరగోళం వెనుక వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రోత్సాహం ఉందని వర్ల రామయ్య సంచలన ఆరోపణలు చేశారు. "సభలో ఎవరు ఎంత గట్టిగా అరిచారు, ఎవరు ఛైర్మన్‌ను ఎంతలా అడ్డుకున్నారు అని సెల్ఫీలు, వీడియోలు తీసుకుని జగన్‌కు పంపుతున్నారు. దానికి ఆయన 'వెరీ గుడ్, యూ ఆర్ పాస్డ్' అని ప్రోత్సహిస్తున్నారు. సభను అడ్డుకోవడానికే జగన్ వారిని పంపించారా? ఇది ప్రజాస్వామ్యమా?" అని ప్రశ్నించారు. మంత్రి నారా లోకేశ్ పై ఈర్ష్య, ద్వేషంతోనే వైసీపీ నేతలు సభలో అసభ్యకర సైగలు చేస్తూ, అనుచితంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 169, 171 ప్రకారం మండలి ఒక సమీక్షా సభ అని, చట్టసభ చేసిన బిల్లులను లోతుగా పరిశీలించి సూచనలు చేయాల్సిన బాధ్యత ఉందని గుర్తుచేశారు. అలాంటి సభను వ్యక్తిగత కక్ష సాధింపులకు వేదికగా మార్చడం దుర్మార్గమన్నారు.

### లోకేశ్ సవాల్‌కు బదులేదీ?

మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను వర్ల రామయ్య తీవ్రంగా ఖండించారు. "మంత్రి నారా లోకేశ్ బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరితే వైసీపీ నేతలు పారిపోయారు. డీఎస్సీలో అవినీతి జరిగిందని ఆరోపణలు చేస్తున్నవారు ఆధారాలు చూపాలి. ఇప్పటికే సంబంధిత శాఖల ఉన్నతాధికారులు అజయ్ జైన్, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మీడియా సమావేశాలు పెట్టి ప్రతీ అంశాన్ని స్పష్టంగా వివరించారు. అయినా అనుమానాలుంటే కార్యాలయానికి వచ్చి నివృత్తి చేసుకోవచ్చని కూడా చెప్పారు. కానీ, వైసీపీ నేతలు వాస్తవాలు తెలుసుకోకుండా నిరుద్యోగులను, ఇప్పటికే ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెగా డీఎస్సీపై హైకోర్టులో 341 పిటిషన్లు దాఖలు కాగా, వాటన్నింటినీ న్యాయస్థానం కొట్టివేసిందని గుర్తుచేశారు. "ఆధారాలుంటే కోర్టుకు వెళ్లాలి, అంతేగానీ ఏడాది క్రితం ఉద్యోగాలు సాధించిన వారిని మానసికంగా వేధించడం సరికాదు. మీ రాజకీయాల కోసం వారి జీవితాలతో ఆడుకోవద్దు" అని హితవు పలికారు.

### కౌరవులు వందమంది.. ఏం ఉపయోగం!

మహాభారతంలో పాండవులు ఐదుగురే ఉన్నా ధర్మం వైపు నిలబడి గెలిచారని, వందమంది కౌరవులు అధర్మం వైపు ఉండి ఓడిపోయారని రామయ్య ఉదహరించారు. "సభలో మా సంఖ్య తక్కువగా ఉండొచ్చు, కానీ మేము ప్రజల పక్షాన, ధర్మం వైపు ఉన్నాం. వైసీపీ తన తీరు మార్చుకోకపోతే కౌరవుల గతే పడుతుంది. ఇప్పటికైనా జగన్ తన ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేసి, సభా గౌరవాన్ని కాపాడేలా చూడాలి. రాబోయే సమావేశాల్లోనైనా వారు పెద్దల సభ సభ్యుల్లా హుందాగా వ్యవహరిస్తారని ఆశిస్తున్నాను" అని వర్ల రామయ్య పేర్కొన్నారు.

## యువత పాత్ర కీలకం

సర్ సంఘ్‌చాలక్ డాక్టర్ మోహన్ భాగవత్, సర్‌కార్యవాహ దత్తాత్రేయ హోసబలే హాజరయ్యారని పేర్కొన్నారు. మూడు రోజులపాటు దేశం, సమాజంలోని పరిస్థితులు, వివిధ సంస్థల కార్యక్రమాలు, భవిష్యత్తు సవాళ్లు, కార్యాచరణపై చర్చించామన్నారు. 'పంచ పరివర్తన్'లో పర్యావరణానికి ప్రథమ ప్రాధాన్యమిస్తున్నట్లు పునరుద్ఘాటించారు. దేశ భవిత యువత చేతుల్లో సురక్షితం: 'దేశంలో మాదకద్రవ్యాల సమస్యను కేవలం ప్రభుత్వాలు, పోలీసుల స్థాయిలో కాకుండా సమాజ భాగస్వామ్యంతో పరిష్కరించాలి. యువత పెద్దఎత్తున ఆరెస్సెస్‌లో చేరుతోంది. దేశ భవిష్యత్తు యువత చేతుల్లో సురక్షితంగా ఉందన్న విశ్వాసం మాకు కలుగుతోంది. వ్యవస్థలో లోపాలను ప్రభుత్వంతోపాటు సమాజం కూడా సరిచేయాలి. 'నీట్' ప్రశ్నపత్రాల లీక్ వంటి అంశాలు, ఇతర వ్యవస్థాగత సమస్యలతో యువత ఆందోళన చెందుతోంది. దీనిని అర్థం చేసుకొని పరిష్కార మార్గం చూపాలి. కేవలం వ్యతిరేకించటం, ఆటంకాలు కలిగించటం ద్వారా పరిష్కారం లభించదు' అని ముకుంద్ వివరించారు. పర్యావరణ పరిరక్షణ, భారతీయ కుటుంబ వ్యవస్థ- విలువలు, సంప్రదాయాలు, ఏఐతో సవాళ్లు-జాగ్రత్తలు అంశాలపై బైఠక్‌లో తీర్మానాలు చేశామని తెలిపారు. మోహన్ భాగవత్ పర్యటన ఉద్దేశం అదే: 'సంఘ్ శత వార్షికోత్సవ ప్రపంచవ్యాప్త కార్యక్రమాల్లో భాగంగా ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్.. అమెరికా, కెనడా, బ్రిటన్‌లో పర్యటించనున్నారు. న్యూయార్క్‌లో 'యూనివర్సల్ వన్నెస్', టొరంటో, లండన్‌లో కమ్యూనిటీ లీడర్‌షిప్ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో భారతదేశం, హిందూసమాజం, ఆరెస్సెస్‌పై ఉన్న అపోహలు, దుష్ప్రచారం నేపథ్యంలో వాస్తవికతను తెలియజేయటమే పర్యటన ముఖ్యోద్దేశం. చర్చించడం ద్వారా విదేశాల్లోని హిందువులు, భారతీయ సంతతి ప్రజల ప్రయోజనాలు, హక్కులపై దృష్టి సారిస్తారు' అని ముకుంద్ స్పష్టం చేశారు. అఖిల భారతీయ ప్రచార ప్రముఖ్ సునీల్ అంబేకర్, సహ ప్రచార ప్రముఖ్ నరేంద్ర, ప్రదీప్‌జోషీ, దక్షిణ మధ్య క్షేత్ర ప్రచార ప్రముఖ్ ఆయుష్, ఆంధ్రప్రదేశ్ ప్రాంత ప్రచార ప్రముఖ్ బయ్యా వాసు, సహ ప్రచార ప్రముఖ్ వాసుదేవరావు పాల్గొన్నారు.

## బంగ్లా ప్రధాని సందిగ్ధం

బంగ్లా వేచి చూస్తున్నట్లు సమాచారం. భారత్‌లో ఆశ్రయం పొందుతున్న మాజీ ప్రధాని షేక్ హసీనా.. త్వరలోనే స్వదేశానికి వెళ్తానని ఇటీవల వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆమె మీడియాతో మాట్లాడటంపై బంగ్లా ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. వెంటనే హసీనాను తమకు అప్పగించాలని బంగ్లా పదే పదే విజ్ఞప్తి చేస్తుండగా.. భారత్ ఆచితూచి స్పందిస్తోంది. మరోవైపు, సెప్టెంబర్ 12-13 దిల్లీలో జరగనున్న బ్రిక్స్ సదస్సులో బంగ్లా ప్రధాని పాల్గొనాల్సి ఉండగా.. అంతకుముందే ఆయన దిల్లీ పర్యటనకు వస్తారని వార్తలు వచ్చాయి. బంగ్లా ప్రధానిని స్వాగతించే కార్యక్రమం కోసం రిహార్సల్స్ జరుగుతున్నాయని రాష్ట్రపతి భవన్ నుంచి ప్రకటన వెలువడినప్పటికీ.. గంటల వ్యవధిలోనే దానిని ఉపసంహరించుకోవడం గమనార్హం.

## అనుమతివ్వలేదు : కేంద్రం

వ్యవహారాల శాఖ పరిశీలిస్తుంది. వారు చేసే పర్యటన.. నిర్వహిస్తున్న పదవి ఉద్దేశానికి తగినట్లుగా ఉండాలి. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి యూకే పర్యటనకు అనుమతి లభించింది. అమెరికా పర్యటన విషయంలో మాత్రం ఆ నిబంధనలను పాటించలేదు. అందుకే అనుమతి నిరాకరించాం" అని రణధీర్ జయస్వాల్ పేర్కొన్నారు.

## 'మా ఊరిలోకి రావొద్దు'..

### సీజేపీ బృందాన్ని వెళ్లగొట్టిన గ్రామస్థులు



**జైపూర్, విశ్వం వాయిస్ న్యూస్:** రాజస్థాన్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల పరిస్థితులను పరిశీలించేందుకు వెళ్లిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) బృందానికి చేదు అనుభవం ఎదురైంది. తమ గ్రామంలోకి రావద్దంటూ స్థానికులు వారిని అడ్డుకొని వెళ్లగొట్టారు. దీంతో అక్కడ కొంతసేపు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

### ఏం జరిగింది?

'స్కూల్ ఠీక్ కరో' అనే కార్యక్రమంలో భాగంగా సీజేపీ కో-కన్వీనర్ అశుతోష్ రంకా నాయకత్వంలో కొందరు కార్యకర్తలు రాజస్థాన్‌లో పర్యటించారు. ఈ క్రమంలో జైపూర్ జిల్లాలోని రాంపురా కన్వర్‌పురా గ్రామానికి వెళ్లేందుకు ప్రయత్నించగా, గ్రామ శివారులోనే స్థానికులు వారిని అడ్డుకున్నారు. తమ పాఠశాలలను తామే బాగు చేసుకుంటామని చెబుతూ, గ్రామస్థులు సీజేపీ బృందాన్ని బలవంతంగా అక్కడి నుంచి పంపించివేశారు.

### సీజేపీ నేతల ఆరోపణలు:

స్థానికులు తమపై రాళ్లతో దాడి చేశారని, తమ వాహనాలను ధ్వంసం చేశారని అశుతోష్ ఆరోపించారు. ఈ దాడిలో తమ ప్రతినిధులు కొందరు గాయపడ్డారని తెలిపారు. అంత జరుగుతున్నా పోలీసులు సంఘటనా స్థలానికి రాలేదని విమర్శించారు. ఈ ఘటనపై స్పందించిన సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, సామాజిక మాధ్యమాల్లో దీనికి సంబంధించిన దృశ్యాలను పంచుకున్నారు. తమ బృందంపై దాడి చేయించడం అధికార భారతీయ జనతా పార్టీ పనేనని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో గూండాల పాలన నడుస్తోందని ఆరోపించారు. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు అంతర్జాలంలో విపరీతంగా ప్రచారమవుతున్నాయి.

## పెల్లెట్ ఘటనపై రాహుల్ ధర్నా

★ పోలీసు స్టేషన్‌లో కాంగ్రెస్ ఆందోళన ★ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్

★ బాధితుడితో కలిసి ఫిర్యాదు ప్రయత్నం



**న్యూఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** జూలై 20న జరిగిన నిరసన కార్యక్రమం సం దర్భంగా పెల్లెట్ గాయాల ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్‌లో ధర్నాకు దిగారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఆందోళనకారులపై పెల్లెట్ గన్స్ ఉపయోగించారని ఆరోపిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్ పరిధిలోని డీసీపీ కార్యాలయంలో కొంతసేపు బైఠాయించారు. పెల్లెట్ గాయాలకు గురైన సాహిల్ లోచవ్ అనే యువకుడిని కూడా ఆయన వెంట తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదును స్వీకరించి కేసు నమోదు చేయాలని పోలీసులను కోరారు. సాహిల్ లోచవ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. పెల్లెట్ గన్స్ వినియోగంపై ఇప్పటివరకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా గానీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గానీ ఎటువంటి ప్రకటన చేయలేదని విమర్శించారు. ముందుగా 19 ఏళ్ల సాహిల్‌తో కలిసి రాహుల్ గాంధీ మందిర్ మార్గ్ పోలీసు స్టేషన్‌కు వెళ్లినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. అయితే అక్కడ ఫిర్యాదు స్వీకరించేందుకు నిరాకరించడంతో అనంతరం పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్‌కు వెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీతో పాటు పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు. బాధితుడికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. పెల్లెట్ గాయాల ఘటనపై రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతున్న వేళ, ఈ అంశంపై అధికారికంగా కేసు నమోదు అవుతుందా లేదా అనే దానిపై ఆసక్తి నెలకొంది. రాహుల్ గాంధీ చేపట్టిన ధర్నాతో ఈ వ్యవహారం మరోసారి జాతీయ రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.

## హైదరాబాద్‌లో జగన్ పర్యటన

ఐపీఎస్ అధికారి కుమారుడి వివాహానికి హాజరు – నూతన వధూవరులకు ఆశీస్సులు
పార్టీ నేతలతో కలిసి వేడుకల్లో పాల్గొన్న జగన్



హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో పర్యటించారు. సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు కుమారుడి వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ పర్యటన ముందుగానే ఖరారైనట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. హైదరాబాద్‌లోని జలవిహార్ గ్రాండ్ లాన్స్‌లో నిర్వహించిన వివాహ కార్యక్రమంలో జగన్ పాల్గొన్నారు. వివాహ వేడుకకు హాజరైన ఆయన వధూవరులు స్నిగ్ధ, అనంత పినాక్ శర్మలకు శుభాకాంక్షలు తెలియజేసి వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వివాహ వేడుకకు వచ్చిన పలువురు ప్రముఖులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో జగన్ ముచ్చటించారు. కుటుంబ సభ్యులను అభినందిస్తూ నూతన దంపతులకు తన ఆశీస్సులు అందజేశారు. పార్టీ నాయకులు, అభిమానులు కూడా పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యారు. జగన్ రాకతో వేడుక ప్రాంగణంలో సందడి నెలకొంది. వివాహ కార్యక్రమం అనంతరం ఆయన కొంతసేపు అక్కడే గడిపినట్లు సమాచారం. హైదరాబాద్ పర్యటన పూర్తయిన తర్వాత జగన్ తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ పర్యటన పూర్తిగా వ్యక్తిగత కార్యక్రమానికి సంబంధించినదేనని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు కుటుంబంలో జరిగిన ఈ వివాహ వేడుకకు రాజకీయ, పరిపాలనా రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

# ఎడిటర్ వాయిస్

## టీడీపీ విత్ జనసేన

### గొడవలు రాకుండా సర్దుబాటు కుదురుతుందా?

పొత్తు పార్టీలతో సానుకూలతలు ఎన్ని ఉంటాయో ఇబ్బందులు కూడా కొన్ని ఉంటాయి. ఒకే పార్టీలోనే విభేదాలు ఉంటున్న రోజులివి. అలాంటివి రెండు మూడు పార్టీలు కలసి పొత్తు పెట్టుకున్నప్పుడి సమస్యలు రావడం సహజం. అందున్నా రెండు ప్రాంతీయ పార్టీల మధ్య పొత్తు ఎపుడూ సవాల్ గానే ఉంటుంది. ఇద్దరి లక్ష్యాలు ఒక్కటే అయినపుడు సర్దుబాటులో కూడా పొరపాట్లు వస్తాయి. ఏపీలో టీడీపీ కూటమిలో ఇపుడు అలాంటి పరిస్థితే కనిపిస్తోంది అని అంటున్నారు. ఒక విధంగా చెప్పాలీ అంటే కూటమి పొత్తులకు అతి పెద్ద పరీక్షగా స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నాయని అంటున్నారు.

పవన్ స్ట్రాంగ్ డెసిషన్ : 2024 ఫార్ములా అన్నది పాతది అని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తేల్చేశారు. 2026 రెండో భాగంలో ఉన్నామిపుడు అన్నది ఆయన భావన. ఈ మధ్య కాలంలో జనసేన బాగా పెరిగింది అని కూడా లెక్క వేస్తున్నారు. దాంతో జనసేన తన వాటాను స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీగానే పెంచుకోవాలని అనుకుంటోంది. ఈ మేరకు కూటమిలో పెద్దన్న టీడీపీతో సరైన సర్దుబాటు కుదురుతుందని కూడా జనసేనాని పవన్ ఆశిస్తున్నారు. అందుకే ఆయన ఒక్కటే మాట అంటున్నారు. టీడీపీ బీజేపీ జనసేనలతో ఐక్యతను కాపాడుకుంటూనే జనసేన తనకు కావాల్సిన సీట్లను సాధించుకుంటుంది అన్నది. ఇక మీ పనులలో మీరు ఉండండి, పార్టీని బలోపేతం చేసుకుంటూ పోటీకి సిద్ధంగా ఉండాలని ఆయన దిశా నిర్దేశం చేశారు.

త్యాగాలు ఇక వద్దు : క్షేత్ర స్థాయిలో జనసేనలో ఎన్నో ఆశలు ఉన్నాయి. మరెన్నో ఆకాంక్షలు ఉన్నాయి. అంతే కాదు జనసేనకు కూడా స్థానిక సంస్థల ఎన్నికలు చాలా ముఖ్యం. సంస్థాగతంగా పార్టీ బలపడడానికి ఇది ఒక మంచి అవకాశం. ఇక్కడ బలమైన పునాది పడితే అది సార్వత్రిక ఎన్నికలకు జనసేనకు పటిష్టం అయిన పథక రచనకు వీలు కల్పిస్తుంది అని కూడా భావిస్తున్నారు. పైగా జనసేనను నమ్ముకుని ఏళ్ళుగా పనిచేస్తున్న క్యాడర్ కి సరైన న్యాయం అందించాలంటే స్థానిక ఎన్నికల్లోనే వారికి సముచితమైన స్థానం కల్పించడమే మార్గం అని కూడా ఆయన భావిస్తున్నారు అని చెబుతున్నారు.

కొత్త ఫార్ములాతోనే : జనసేన ఈ నేపథ్యంలో కొత్త ఫార్ములాతోనే ముందుకు వస్తుందని అంటున్నారు. జనసేన ఓటు షేర్ కచ్చితంగా 15 నుంచి 20 శాతం దాకా ఉంటుందని కూడా పార్టీ వర్గాలు అంటున్నారు. ఈ లెక్కనే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీటు షేరింగ్ ఉండాలని ఆశిస్తున్నారు. మరో రెండు నెలలలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పొత్తులు ఎటూ ఉంటాయి కాబట్టి 2024 ఎన్నికల్లో మాదిరిగా సెంట్ పర్సెంట్ స్ట్రైక్ రేట్ తో విజయం సాధిస్తే 2029లో అధికారం దిశగా జనసేన గట్టిగా ఆలోచించేందుకు కూడా ఆస్కారం ఏర్పడుతుందని అధినాయకత్వం భావిస్తోంది. ఇక ఈ క్రమంలో 30 శాతం పైగా సీట్లను జనసేన కోరనుంది అని కూడా ప్రచారం సాగుతోంది.

గొడవలు లేకుండానే : ఇక్కడ ఒక విషయం ఉంది. జనసేన అధినేత పవన్ రాజకీయ పరిణతి కలిగిన వారే. అదే సమయంలో చంద్రబాబు కూడా ఎక్కడ తగ్గాలో తెలిసిన వారే అని అంటున్నారు. అందువల్ల ఈ ఇద్దరూ కలసి కూర్చుంటే ఎలాంటి గొడవలు రాకుండా సీటు షేరింగ్ అన్నది జరిగిపోతుంది అని కూడా రెండు పార్టీలలో ఆశ ఉంది. 2024 వ్యూహం ఎటూ జనసేన ఒప్పుకోదు కాబట్టి టీడీపీ కూడా కొంత తగ్గి ఆలోచిస్తుంది అని అంటున్నారు. ఎక్కువ సీట్లు మిత్ర పక్షంగా జనసేన కోరడం సహజం. అయితే ఎక్కడ ఎక్కువ బలం ఉంది, గెలుపు అవకాశాలు ఉన్నాయన్నది ఆలోచించుకుని సీట్ షేరింగ్ జరుపుకుంటే సమస్య అన్నది ఉత్పన్నం కాదని అంటున్నారు.

తమ్ముళ్లను ఒప్పించాలి : టీడీపీ విషయం చూస్తే బూత్ లెవెల్ వరకూ పాతుకుని పోయిన పార్టీ అది. ఎంతో మంది కార్యకర్తలు ఉన్నారు. కోటికి దాటిన సభ్యత్వం ఉంది. దాదాపుగా స్థానికంగా పటిష్టంగా ఉన్న పార్టీ అది. స్థానిక ఎన్నికల్లో పోటీకి టీడీపీ తమ్ముళ్ళు కూడా ఎంతగానో ఉత్సాహం చూపిస్తున్నారు. మరి వారిని సముదాయించి దారికి తేవడమే అధినాయకత్వం ముందు ఉన్న సవాల్ అని అంటున్నారు. అలా కనుక జరిగితే కథ సుఖాంతం అవుతుంది. లేకపోతే ఇబ్బందులు వస్తాయి కూటమి ఐక్యతకు కూడా అది బీటలు వార్చేసే పరిస్థితికి దారి తీస్తుంది అని అంటున్నారు. మరో వైపు కూటమికి ఉమ్మడి ప్రత్యర్థిగా వైసీపీ ఉంది. ఈ పరిణామాలు అన్నీ నిశితంగా వైసీపీ పరిశీలిస్తోంది. ఏది ఏమైనా చంద్రబాబు పవన్ కలిసి కూర్చుంటే సమస్యకు పరిష్కారం లభిస్తుంది అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## అదుపు తప్పిన కారు.. కుటుంబం జలసమాధి

### దుబ్బాక మండలం అప్పనపల్లిలో ఘటన – సెల్ టవర్ లొకేషన్ ఆధారంగా గుర్తింపు




**దుబ్బాక, విశ్వం వాయిస్ న్యూస్ :** అదుపు తప్పిన కారు రహదారి సమీపాన ఉన్న వ్యవసాయ బావిలో పడి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు జలసమాధి అయ్యారు. ఈ విషాద ఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అప్పనపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... జిల్లాలోని బల్వంతాపూర్ వడ్డెర కాలనీకి చెందిన ఇసుక వ్యాపారి దండుగుల రాజు సిద్దిపేట పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌లో బావ మల్లేశం దశదిన కర్మకు కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి గ్రామానికి తిరిగి వస్తుండగా బుధవారం సాయంత్రం అప్పనపల్లి శివారులోకి రాగానే కారు అదుపుతప్పి రహదారి సమీపాన ఉన్న బావిలోకి దూసుకుపోయింది. కారులో ఉన్న రాజు(33), భార్య భాగ్యలక్ష్మి(25), కుమారుడు నేహాన్ష్(4), కుమార్తె శాన్విక(2) జలసమాధి అయ్యారు. బావి పక్కన గడ్డి, ఇతర మొక్కలు ఉండటంతో ప్రమాద ఘటనను ఎవరూ గుర్తించలేకపోయారు. చివరికి సెల్ టవర్ లొకేషన్ ఆధారంగా ఆచూకీ కనుగొన్నారు. ప్రశాంత్‌నగర్ నుంచి ప్రమాద స్థలికి 16 కిలోమీటర్ల దూరం ఉంది. కారు 80 కిలోమీటర్ల వేగంతో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

**ఆలస్యంగా గుర్తింపు**

బుధవారం సాయంత్రం దాదాపు 6 గంటల ప్రాంతంలో ప్రమాదం జరిగినట్లుగా పోలీసులు నిర్ధారిస్తున్నారు. రాత్రయినా ఇంటికి చేరుకోకపోవడంతో రాజు, భాగ్యలక్ష్మి ఫోన్లకు పలుమార్లు బంధువులు కాల్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చాయి. రాత్రి 10 గంటలకు దుబ్బాక పోలీస్‌స్టేషన్‌లో వారు ఫిర్యాదు చేశారు. సెల్ టవర్ లొకేషన్ ద్వారా కారు అప్పనపల్లి శివారులో ఉన్నట్లు రాత్రి 11:30 గంటలకు పోలీసులు గుర్తించారు. స్థానికులను అప్రమత్తం చేశారు. గ్రామానికి చెందిన రాజిరెడ్డి, రజనీకర్‌రెడ్డి రోడ్డు సమీపంలోని వ్యవసాయ బావిలో కారు వెనుక భాగం కొంత నీటిలో పైకి తేలడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. గురువారం తెల్లవారుజామున 3:30 గంటలకు బావిలో పడిన కారును క్రేన్ సహాయంతో బయటికి తీశారు. కారులోని నలుగురూ విగతజీవులై ఉన్నారు. సిద్దిపేట పోలీసు కమిషనర్ రష్మీ పెరుమాళ్ బావిని పరిశీలించారు. పూర్తి స్థాయిలో విచారణ చేయిస్తామన్నారు.

## కారు డిక్కీలో మహిళ మృతదేహం.. ఎల్కతుర్తిలో కలకలం



**ఎల్కతుర్తి, విశ్వం వాయిస్ న్యూస్ :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో కారులో మహిళ మృతదేహం లభ్యం కావడం కలకలం రేపింది. బస్టాండ్ సమీపంలో రెండ్రోజులుగా పార్క్ చేసిన కారు నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు.. కారు డిక్కీని ఓపెన్ చేయగా మహిళ మృతదేహం మూటకట్టి ఉంది. కారు నంబర్ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. మృతురాలు గోదావరిఖనికి చెందిన మానస (33)గా గుర్తించారు. కారును మానస స్నేహితుడు వినోద్ అద్దెకు తెచ్చినట్టు సమాచారం. దీంతో వినోద్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. "కరీంనగర్‌లో గదిలో ఉన్నప్పుడు మానసకు ఫిట్స్ వచ్చాయి. ఫిట్స్, నోట్లో నుంచి నురగలు వచ్చి ఆమె చనిపోయింది. భయంతో మృతదేహాన్ని ఎల్కతుర్తి వద్ద కారులోనే వదిలి వెళ్లిపోయా" అని వినోద్ పోలీసులకు చెప్పినట్టు తెలుస్తోంది. కేసు నమోదు చేసిన ఎల్కతుర్తి పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. వినోద్ చెప్పిన విషయాలు నిర్ధరించుకునే పనిలో ఉన్నారు.

ఏఈ కుటుంబం ఆత్మహత్య..

## ఢిల్లీలో సాధిక్‌ఖాన్ అరెస్ట్?



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడకు చెందిన పంచాయతీరాజ్ ఏఈ నూకరాజు కుటుంబం సామూహిక ఆత్మ హత్యకు కారకుడైన రైఫిల్ షూటింగ్ కోచ్ షేక్ సాధిక్ ఖాన్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కినట్లు సమాచారం. గత అయిదు రోజు లుగా నిందితుడిని పట్టుకునేందుకు పది మంది ఎస్ఐలు సహా 40 మంది పోలీసులు ప్రత్యేక బృందాలుగా గాలిస్తున్నారు. శుక్రవారం పక్కా సమాచారంతో ఢిల్లీలో పోలీసు బృందాలు చేపట్టిన తనిఖీల్లో సాధిక్ చిక్కినట్లు తెలిసింది. నిందితుడ్ని ఆదివారం నాటికి కాకినాడకు తీసుకువచ్చే అవకాశం ఉంది. రాష్ట్రంలో సంచలనం కలిగించిన ఇంజినీరు నూకరాజు కుటుంబం ఆత్మహత్యతో పాటు, అతని అల్లుడు జగదీశ్వరరెడ్డి మృతి వెనుక సాధిక్ హస్తంపైనా పోలీసులు విచారించనున్నారు.

గుప్తనిధులంటూ కుటుంబానికి దగ్గరై..


## అల్లుడిగా సెటిలైన దొంగ బాబా



**విశ్వం వాయిస్ న్యూస్ :** మీ ఇంట్లో గుప్తనిధులు ఉన్నాయి.. అందుకే సమస్యలు వస్తున్నాయంటూ దొంగ బాబా ఓ కుటుంబానికి టోకరా కొట్టాడు. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లికి చెందిన దంపతులకు ముగ్గురు కుమార్తెలున్నారు. ఇంటి పెద్ద మరణంతో వారు నిత్యం సమస్యలతో సతమతమవుతున్నారు. అలాంటి సమయంలో వారి సమస్యలను తీరుస్తానంటూ హేమంత్ అనే ఓ దొంగ బాబా వచ్చాడు. ఇంట్లోని గుప్తనిధుల వల్లే సమస్యలు వస్తున్నాయంటూ బురిడీ కొట్టించాడు. వాటిని వెలికితీస్తే సమస్యలు తీరతాయంటూ మాయమాటలు చెప్పాడు. అంతేకాకుండా తన మాయజాలంతో మట్టిలోంచి చిన్న విగ్రహాలు తీసి చూపించాడు. దీంతో ఆ కుటుంబం అతడిని గుడ్డిగా నమ్మింది. ఈక్రమంలో వారికి దగ్గరై ఆ ఇంటి అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. పెళ్లైన కొన్ని రోజులకు యువతి అతడి నిజస్వరూపాన్ని గుర్తించడంతో బండారం బయటపడింది. నిందితుడికి అప్పటికే రెండు పెళ్లిల్లు అయ్యాయి. హిందూ బాబాగా పరిచయం చేసుకున్న అతడు.. వేరే వర్గానికి చెందిన వ్యక్తి అని తేలడంతో అంతా కంగుతిన్నారు. అతడి అసలు పేరును నజర్ మస్తాన్‌గా, స్వస్థలం మిర్యాలగూడగా గుర్తించారు. కొందరి బెదిరింపులతో ఊరు దాటిన మస్తాన్ తాజాగా మళ్లీ తిరిగి వచ్చాడు. అప్పటికే ఆగ్రహంతో ఉన్న గ్రామస్థులు నిందితుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.






**మ్యారేజ్ స్పెషల్ బస్సుల వసూళ్లపైనా అనుమానాలు - డబుల్ డ్యూటీ చెల్లింపుల్లోనూ అవకతవకల ఆరోపణలు**
**ఆగస్టు 18 నుంచి క్లర్క్ గైర్హాజరు - డిపో మేనేజర్ ఫిర్యాదుతో పోలీసుల దర్యాప్తు**

**రామచంద్రపురం, ఆగస్టు 21, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం ఆర్టీసీ డిపోలో భారీగా నగదు అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది. డిపో క్యాష్ డెస్క్‌లో విధులు నిర్వహిస్తున్న క్లర్క్ ఏ.పీ.కె. రావు (ఎంప్లాయ్ నంబర్ ఇ.306977)కు సంబంధించిన లావాదేవీల్లో సుమారు రూ.30,05,373 మేరకు నగదు వ్యత్యాసం గుర్తించినట్లు సమాచారం. రోజువారీ వసూళ్లు, ప్రత్యేక బస్సుల ఆదాయం, డబుల్ డ్యూటీ చెల్లింపులు తదితర అంశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించిన సమయంలో ఈ వ్యవహారం బయటపడినట్లు తెలుస్తోంది.

**ఆడిట్ తనిఖీలతో బట్టబయలు**

డిపోకు వచ్చే రోజువారీ నగదు వసూళ్లు, రసీదులు, బ్యాంకు జమలు, ఖాతా పుస్తకాలు, ప్రత్యేక బస్సుల ద్వారా వచ్చే ఆదాయం తదితర వివరాలను ఆడిట్ అధికారులు పరిశీలించగా భారీ వ్యత్యాసాలు గుర్తించినట్లు సమాచారం. సంస్థ ఖాతాల్లో జమ కావాల్సిన నగదుకు, రికార్డుల్లో నమోదైన మొత్తాలకు మధ్య తేడాలు ఉండటంతో అధికారులు మరింత లోతుగా తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది.

**రూ.30 లక్షలకు పైగా తేడా ఎలా వచ్చింది?**

ప్రాథమికంగా గుర్తించిన నగదు వ్యత్యాసం రూ.30.05 లక్షలకు పైగా ఉండటంతో ఆర్టీసీ అధికారులు అప్రమత్తమైనట్లు సమాచారం. ఈ మొత్తంలో ఏఏ లావాదేవీలకు సంబంధించి తేడాలు ఉన్నాయి? ఎంత నగదు వసూలైంది? ఎంత మొత్తాన్ని సంస్థ ఖాతాలో జమ చేశారు? ఎంత మొత్తం జమ కాలేదు? అనే అంశాలపై రికార్డులను సరిపోల్చుతూ అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు.

**మ్యారేజ్ స్పెషల్ బస్సుల వసూళ్లపైనా అనుమానాలు**

వివాహాలు, శుభకార్యాల కోసం బుక్ చేసిన మ్యారేజ్ స్పెషల్ బస్సుల వసూళ్లలోనూ లెక్కల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు ప్రాథమిక తనిఖీల్లో గుర్తించినట్లు సమాచారం. బస్సుల బుకింగ్ వివరాలు, ప్రయాణించిన దూరం, వసూలైన మొత్తం, రసీదులు, సంస్థ ఖాతాల్లో జమ అయిన నగదు తదితర వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు.

**డబుల్ డ్యూటీ లెక్కల్లోనూ గందరగోళం**

డిపో సిబ్బంది నిర్వహించిన డబుల్ డ్యూటీలకు సంబంధించిన రికార్డులు, హాజరు వివరాలు, చెల్లింపుల వివరాల్లోనూ వ్యత్యాసాలు ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. వాస్తవంగా నిర్వహించిన డ్యూటీలు ఎన్ని? వాటికి చెల్లించిన మొత్తం ఎంత? రికార్డుల్లో నమోదైన వివరాలు వాస్తవాలతో సరిపోతున్నాయా? అనే కోణంలోనూ విచారణ జరుగుతోంది.

**ఆగస్టు 18 నుంచి క్లర్క్ జాడేది?**

ఈ అవకతవకలపై తనిఖీలు జరుగుతున్న సమయంలోనే సంబంధిత క్లర్క్ ఏ.పీ.కె. రావు ఆగస్టు 18 నుంచి విధులకు హాజరు కావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో అనుమానాలు మరింత బలపడినట్లు తెలుస్తోంది. ఆయన గైర్హాజరుపై కూడా అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

**డిపోలోనే తిష్ట వేసిన ప్రత్యేక బృందాలు**

వ్యవహారం తీవ్రత దృష్ట్యా ఆర్టీసీ విజిలెన్స్, అకౌంట్స్ విభాగాల అధికారులు రామచంద్రపురం డిపోలో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. నగదు రసీదులు, రోజువారీ వసూళ్లు, బ్యాంకు జమలు, ప్రత్యేక బస్సుల బుకింగ్‌లు, డబుల్ డ్యూటీ రికార్డులు, చెల్లింపుల వివరాలను విడివిడిగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

**పోలీసులకు డిపో మేనేజర్ ఫిర్యాదు**

భారీ నగదు వ్యత్యాసం గుర్తించిన నేపథ్యంలో డిపో మేనేజర్ స్థానిక పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది. అందుబాటులో లేని క్లర్క్ ఆచూకీ కోసం చర్యలు చేపట్టడంతో పాటు, నగదు లావాదేవీలకు సంబంధించిన కీలక రికార్డులను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

**ఒక్కడి చేతివాటమా? మరెవరైనా ఉన్నారా?**

ఈ వ్యవహారంలో కేవలం క్యాష్ డెస్క్ క్లర్క్ పాత్ర మాత్రమే ఉందా? లేక మరెవరైనా సిబ్బంది సహకారం ఉందా? నగదు వసూళ్లు, రికార్డుల నిర్వహణ, బ్యాంకు జమల ప్రక్రియలో ఇతరుల పాత్ర ఏమైనా ఉందా? అనే కోణాల్లోనూ అధికారులు, పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. రూ.30.05 లక్షల నగదు వ్యత్యాసం వెనుక అసలు కథ ఏమిటి? ఈ మొత్తం ఎక్కడికి వెళ్లింది? ఎన్ని రోజులుగా ఈ లావాదేవీలు కొనసాగుతున్నాయి? ఈ వ్యవహారంలో ఇంకా ఎవరెవరి పాత్ర వెలుగులోకి వస్తుంది? అన్నది ఆడిట్, విజిలెన్స్, పోలీసుల దర్యాప్తు పూర్తయితేనే స్పష్టమయ్యే అవకాశం ఉంది.

**డీఎస్సీపై మండలిలో చర్చకు రాకుండా**

## నారా లోకేష్ పారిపోయారు

రైతు, యువత , మహిళను పూర్తిగా మోసం చేశారు

ఎమ్మెల్సీ తోట ఘాటు విమర్శలు



**మండపేట టౌన్, ఆగస్టు 21, విశ్వంవాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం డీఎస్సీ , రైతులు, యువత, రాష్ట్ర సమస్యలపై పట్టించుకోవడం మానేసిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సబ్‌ఆర్డినేటర్ కమిటీ చైర్మన్, మండపేట ఇన్‌ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఘాటుగా విమర్శించారు. నాలుగు రోజుల పాటు జరిగిన కౌన్సిల్ సమావేశాలు ప్రజల్లో అసంతృప్తిని మాత్రమే మిగిల్చాయని ఆయన అన్నారు. శుక్రవారం మండపేట విజయలక్ష్మినగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో తోట మాట్లాడుతూ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అసెంబ్లీలో డీఎస్సీలో ఎలాంటి పొరపాట్లు జరగలేదని చెప్పడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ నారా చంద్రబాబు, లోకేష్ భజనకే ఉపయోగపడిందని ఆరోపించారు. ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి 6 వేల ఉద్యోగాలకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి మర్చిపోయారని, గత ప్రభుత్వంలో విద్యారంగంలో సుమారు 9 వేల మందికి (కాంట్రాక్టు, పర్మనెంట్‌తో కలిపి) ఉద్యోగాలు ఇచ్చిన గణాంకాలు చూసుకోవాలని సవాలు చేశారు. తప్పుడు సమాచారం ఇస్తున్నారని దుయ్యబట్టారు. ఉద్యోగుల పేరుతో స్పోర్ట్స్ కోటాలో తప్పుదారి పట్టించి దోపిడీ చేశారని, ముఖ్యమంత్రి అసెంబ్లీలో జీవోలు మార్చి అనుకూల వ్యక్తులకు ఉద్యోగాలిచ్చి, విషయాలు బయటపడతాయని భయపడి రద్దు చేశారని ఆరోపించారు. జీవోలు రద్దు చేసినప్పుడు ఉద్యోగులు అనర్హులే కాదా అని ప్రశ్నించారు. మూడుసార్లు జీవోలు మార్చడం ద్వారా డీఎస్సీ డొల్లతనం బయటపడుతోందన్నారు. జగన్ హయాంలో ఏపీపీఎస్సీలో అవకతవకలు జరిగాయని చెప్పడం సిగ్గుచేటని, చిత్తశుద్ధి ఉంటే డీఎస్సీ, ఏపీపీఎస్సీపై పూర్తి స్థాయి సీబీఐ విచారణ చేపట్టి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ఏపీపీఎస్సీలో అవకతవకలు లేవని కూటమి నాయకులు చెప్పారని గుర్తు చేశారు. రెండు ప్రభుత్వాల వ్యవహారాలపై సీబీఐ విచారణ జరిపి దోషులు, నిర్దోషులను నిర్ధారించాలన్నారు. లోకేష్ అడ్డంగా దొరికిపోయి మండలికి రాకుండా పారిపోయారని ఎద్దేవా చేశారు. డీఎస్సీలో 400 ఉద్యోగాలు స్పోర్ట్స్ కోటాలో ఇచ్చినప్పుడు మెరిట్ ఆధారంగా ఎక్కడ తీసుకున్నారో చెప్పలేక పారిపోయారని విమర్శించారు. రైతులు వ్యవసాయం ప్రారంభించిన తర్వాత నీరు లేకుండా చేసి నష్టపోయేలా చేశారని, పత్తి, మిర్చి, పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు లేవని తెలిపారు. రైతు భరోసా బకాయిలు చెల్లించాలని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగులకు ఉద్యోగభృతి, 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు నెలకు ?1,500, 50 ఏళ్లు నిండిన వారికి పెన్షన్ ఇస్తామని ఇవ్వలేదని గుర్తు చేశారు. ఈ అంశాలపై సమాధానాలు చెప్పాల్సి వస్తుందని భయపడి అసెంబ్లీ నుంచి పారిపోయే ప్రక్రియ చేశారన్నారు. నియోజకవర్గం లో సూపర్ సిక్స్ అమలు చేయకుండా ప్రశ్నించిన ప్రజలపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక కూటమి కార్యకర్తలు సతమతమవుతున్నారన్నారు. తీవ్ర నీరు లేని పరిస్థితుల్లో రైతాంగం కరువు ఎదుర్కొంటుందని, ఈ అంశాలు చట్టసభల్లో చర్చిస్తే రైతులకు లాభం చేకూరేదని అన్నారు. చంద్రబాబు వ్యవసాయ రంగాన్ని భ్రష్టుపట్టించారని ఆరోపించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఇస్తామనడం మోసమేనని, 50 శాతం దాటకూడదన్న విషయం తెలిసినా మోసం చేస్తున్నారని తెలిపారు. పెంపు చేయాలంటే కేంద్ర చట్టం ప్రకారం 9వ షెడ్యూలులో చేర్చాలని, ఎన్‌డీఏతో కలిసి బిల్లు ప్రవేశపెట్టాలని సవాలు చేశారు. పక్క రాష్ట్రాల్లో బిల్లులు ప్రవేశపెడితే కోర్టులు కొట్టేశాయని గుర్తు చేశారు. మంజునాథన్ కమిషన్ ద్వారా కాపులకు 5 శాతం రిజర్వేషన్ ఇస్తామన్నారు. ఎన్‌డీఏతో కలిసి ప్రయత్నించి చిత్తశుద్ధి చాటుకోవాలని, ఇప్పుడు మీ ప్రభుత్వమే ఉంది కాబట్టి అమలు చేయాలని డిమాండ్ చేశారు. జగన్ ఆపేశారనడం సరికాదని, 26 నెలలు దాటినా మీరెందుకు ప్రయత్నం చేయడం లేదని ప్రశ్నించారు. ఈడబ్ల్యూఎస్ 10 శాతం మాత్రమే అమలవుతోందని, రిజర్వేషన్లపై సరైన అవగాహనతో మాట్లాడాలని హితవు చెప్పారు. పార్టీలకు అతీతంగా కాపు జాతికి జరుగుతున్న ద్రోహాన్ని ఖండించాలన్నారు. మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని తోట స్పష్టం చేశారు. ఇప్పుడు మొసలికన్నీళ్లు కారుస్తున్నారని ఆరోపించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, త్వరలోనే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాయవరం మండలం ఎంపీపీ నౌడు వెంకటరమణ, మున్సిపల్ మాజీ విప్పు పోతంశెట్టి ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు పిల్లా వీరబాబు, టౌన్ బూత్ కన్వీనర్ సూరంపూడి సత్యప్రసాద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురం శ్రీనివాస్, గొలుగూరి సందీప్, చిర్ల జయరామ్ రెడ్డి, కోణాల చంద్రబోస్, వాసిరెడ్డి అర్జున్, ఎంపీటీసీలు నల్లమిల్లి రామచంద్రా రెడ్డి, పలివెల మధు, వేరెళ్ళ సత్యనారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రూట్ మిక్సర్‌లో సాంకేతిక లోపం.. విద్యుదాఘాతంతో వ్యాపారి మృతి

**అసువులు బాసిన నెల్లూరు కు చెందిన చిరు వ్యాపారి వెంకటేష్ - మృతదేహం తరలింపుకు స్థానిక వ్యాపారుల ఆర్థిక సాయం**

**రాయవరం, ఆగస్టు 21, విశ్వంవాయిస్ న్యూస్ :** మండల కేంద్రమైన రాయవరంలో విద్యుదాఘాతానికి గురై ఫ్రూట్ జ్యూస్ వ్యాపారి మృతి చెందిన విషాద ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. నెల్లూరు జిల్లా కావలికి చెందిన వెంకటేష్ (43) రాయవరంలో 'అక్షర ఫ్రూట్ జ్యూస్' పేరుతో చిరు వ్యాపారం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. రోజువారీ వ్యాపారంలో భాగంగా శుక్రవారం ఉదయం ఫ్రూట్ మిక్సర్ తయారు చేస్తుండగా, మిక్సీకి సంబంధించిన సాంకేతిక లోపం కారణంగా విద్యుదాఘాతానికి గురయ్యారు. ఈ ఘటనలో వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. అయితే అప్పటికే వెంకటేష్ మృతి చెందడంతో, వైద్య సిబ్బంది సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని స్థానికులు తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని స్వస్థలమైన నెల్లూరుకు తరలించేందుకు కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న రాయవరం స్థానిక వ్యాపారులు మానవతా దృక్పథంతో స్పందించారు. వ్యాపారులంతా కలిసి ఆర్థిక సహాయం అందించి, మృతదేహాన్ని నెల్లూరుకు తరలించేందుకు సహకరించారు. ఆపద సమయంలో అండగా నిలిచిన రాయవరం వ్యాపారుల ఔదార్యాన్ని స్థానికులు అభినందించారు.









# సమస్యల పరిష్కారమే లక్ష్యం

## అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు - ప్రజాదర్బార్‌లో సమస్యల వెల్లువ.. పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు





**అమలాపురం, ఆగస్టు 21, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యలను తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపడమే లక్ష్యంగా అమలాపురం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని స్వీకరించిన అల్లాడ స్వామి నాయుడు, సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను క్షుణ్ణంగా పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులకు ప్రాధాన్యతనిస్తూ, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ ప్రభుత్వ సేవలు అర్హులైన ప్రజలకు సక్రమంగా అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన అన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడం ద్వారా పరిష్కార మార్గాలను చూపించడమే ప్రజాదర్బార్ ప్రధాన ఉద్దేశమని అల్లాడ స్వామి నాయుడు తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని బాధ్యతగా పరిగణించి, పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మట్టా ప్రభాకర్, కర్రి దత్తుడు, పెద్దిరెడ్డి రాము, యేడిద శ్రీను, నల్లా చిట్టిబాబు, భాస్కర్ల రామకృష్ణతో పాటు కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

### మహిళలు భక్తిశ్రద్ధలతో

# జరుపుకున్న వరలక్ష్మీ వ్రతం



**రావులపాలెం, ఆగస్టు 21, విశ్వం వాయిస్ న్యూస్ :** వరలక్ష్మీ వ్రతం హిందూ సంప్రదాయంలో ఎంతో పవిత్రమైన వ్రతం. ముఖ్యంగా శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజున ఈ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. వరలక్ష్మీ దేవిని సంపద, సౌభాగ్యం, ఆరోగ్యం, సంతానం, ఐశ్వర్యం మరియు కుటుంబ శ్రేయస్సును ప్రసాదించే లక్ష్మీ స్వరూపంగా భావిస్తారు. భక్తితో వ్రతం చేసేవారికి అమ్మవారి అనుగ్రహం లభిస్తుందని విశ్వాసం. కలశం ఏర్పాటు చేసి అమ్మవారిని ఆవాహన చేయడం, పసుపు, కుంకుమ, పూలతో అలంకరించడం, అమ్మవారికి పూలు, పండ్లు, నైవేద్యాలు సమర్పించడం, వరలక్ష్మీ వ్రత కథ వినడం, తోరాన్ని పూజించి చేతికి ధరించడం, ముత్తైదువులను పిలిచి తాంబూలం ఇవ్వడం, కలశంలో నీరు, పసుపు, అక్షతలు మొదలైనవి ఉంచి, పైభాగంలో కొబ్బరికాయను పెట్టి అమ్మవారి స్వరూపంగా పూజిస్తారు. కలశానికి మామిడి ఆకులు, పూలు, వస్త్రాలతో అలంకరణ చేస్తారు. కుటుంబంలో సుఖశాంతులు, ఐశ్వర్యం, ఆరోగ్యం, సౌభాగ్యం మరియు శ్రేయస్సు కలగాలని అమ్మవారిని ప్రార్థించడం. ఇవి వరలక్ష్మి వ్రతంలో ముఖ్య ఘట్టాలు. “శ్రీ వరలక్ష్మీ దేవి కృపతో ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఐశ్వర్యం, ఆరోగ్యం నిండాలని కోరుకుందాం.”

### విశాఖ చిన్నారి మృతి ఘటనపై

# వైసీపీ నేత కుంచే రమణారావు దిగ్భ్రాంతి



**అమలాపురం, ఆగస్టు 21, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖపట్నంలో చిన్నారి ప్రణయ్ తేజ్ మృతి చెందిన విషాద ఘటనపై అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కుంచే రమణారావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చిన్నారి మృతి అత్యంత బాధాకరమని, ఈ ఘటన ప్రతి ఒక్కరినీ కలచివేసిందని ఆయన పేర్కొన్నారు. చిన్నారి ప్రణయ్ తేజ్ మృతి ఘటనకు దారితీసిన పరిస్థితులపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని రమణారావు డిమాండ్ చేశారు. ఘటనకు బాధ్యులుగా తేలిన స్కూల్ యాజమాన్యం, సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రభుత్వం స్పష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల భద్రతకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అన్నారు. చిన్నారుల రక్షణ, భద్రత విషయంలో పాఠశాల యాజమాన్యాలు బాధ్యతాయుతంగా వ్యవహరించేలా కఠిన నిబంధనలు అమలు చేయాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నారి ప్రణయ్ తేజ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని రమణారావు కోరారు. బాధిత కుటుంబానికి అవసరమైన ఆర్థిక సహాయంతో పాటు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. తమ బిడ్డను కోల్పోయిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. చిన్నారి మృతి ఘటనపై సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రమణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పాఠశాలల్లో భద్రతా ప్రమాణాలను మరింత పటిష్టం చేయాలని ఆయన కోరారు.

### బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పనపై

# రామచంద్రపురంలో కూటమి శ్రేణుల ఘన సంబరాలు



**రామచంద్రపురం, ఆగస్టు 21, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణంలోని పసలపూడి జంక్షన్ వద్ద గురువారం కూటమి పార్టీల నేతలు, బీసీ సంఘాల నాయకులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 33.33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయానికి మద్దతుగా ఈ వేడుకలు చేపట్టారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా బయలుదేరిన నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేస్తూ పట్టణ వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహంతో పాటు సీఎం చంద్రబాబు నాయుడు, ప్రధాని నరేంద్ర మోడీ, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్, వాసంశెట్టి సుభాష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న కూటమి సీనియర్ నేత వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ.. బీసీల సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యమే లక్ష్యంగా ఈ ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ వేసిన పునాదులపై సీఎం చంద్రబాబు మరింత ముందుకు వెళ్లి బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా నిర్ణయం తీసుకోవడం రాష్ట్ర రాజకీయ చరిత్రలో మైలురాయి అని కొనియాడారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో కోర్టు తీర్పులు, సాంకేతిక కారణాల పేరుతో రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించడం వల్ల బీసీలు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,680 స్థానాలు కోల్పోయారని గుర్తుచేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి.. త్వరలోనే బీసీ రక్షణ చట్టాన్ని కూడా అమలు చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాట తప్పని ప్రభుత్వమని, హామీలను అమలు చేసే ప్రభుత్వమని ఈ నిర్ణయంతో మరోసారి రుజువైందన్నారు. రాష్ట్ర పురోగతికి బీసీల అభివృద్ధి పునాది లాంటిదని, వారికి ఆర్థికంగా, రాజకీయంగా సముచిత స్థానం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల ప్రతినిధులు, కూటమి పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రిజర్వేషన్ల పెంపు నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

### విధుల్లో అలసత్వం వహిస్తే

# కఠిన చర్యలు తప్పవు

## వైద్య సిబ్బందికి మంత్రి కందుల దుర్గేష్ హెచ్చరిక
## నిడదవోలు ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి
## వైద్యసేవలపై ఆరా.. వైద్యుల తీరుపై తీవ్ర ఆగ్రహం



**నిడదవోలు, ఆగస్టు 21, విశ్వం వాయిస్ న్యూస్ :** అసెంబ్లీ వేదికైనా, నియోజకవర్గ ప్రజా సమస్యలైనా మంత్రి దుర్గేష్ ప్రాధాన్యం ప్రజా రోగ్యమే అని మరోసారి నిరూపితమైంది.. గత రెండు మూడు రోజులుగా స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో, పత్రికల్లో నిడద వోలు ప్రభుత్వాసుపత్రి సేవలపై వస్తున్న వార్తలపై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పందిం చారు. అసెంబ్లీ సమావేశాలు ముగి సిన వెంటనే ఆయన నేరుగా నిడద వోలు ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ఈ తనిఖీలో భాగం గా మంత్రి దుర్గేష్ ఎమర్జెన్సీ, జనరల్ వార్డులను స్వయంగా పరిశీలించారు. ఆసుపత్రి అంతా కలియతిరిగి, చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలు,డాక్టర్లు మరియు సిబ్బంది అందుబాటు, మందుల నాణ్యత గురించి అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆసుపత్రి వేళల్లో వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లలేని పేద ప్రజలే ప్రభుత్వాసుపత్రిని ఆశ్రయిస్తారని, వారికి సక్రమంగా వైద్యం అందించాల్సిన పూర్తి బాధ్యత వైద్య యంత్రాంగానిదేనని గుర్తుచేశారు.రాత్రి సమయంలో ఆసుపత్రిలో తప్పనిసరిగా ఇద్దరు డాక్టర్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.ఆసుపత్రి ప్రాంగణాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని, వైద్యపరమైన ఫిర్యాదులు పునరావృతం కాకూడదని హెచ్చరించారు.ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తుందని, ప్రజలకు సేవ చేయడానికి ఇష్టం లేనివారు బయటకు వెళ్లిపోవచ్చని ఘాటుగా తెలిపారు.నిడదవోలు ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటానని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి నేరుగా రాత్రి వేళల్లో ఆసుపత్రిని తనిఖీ చేసిన మంత్రి కందుల దుర్గేష్ చొరవపై స్థానిక ప్రజలు, రోగులు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో

# ‘ఆర్టిస్ట్రీ’ ప్రత్యేక ఆభరణాల ప్రదర్శన



**అమలాపురం, ఆగస్టు 21, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆభరణాల్లో కళాత్మకత, సంప్రదాయం, ఆధునికతకు ప్రాధాన్యమిస్తూ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ అమలాపురం షోరూంలో ‘ఆర్టిస్ట్రీ’ పేరుతో ప్రత్యేక ఆభరణాల ప్రదర్శనను నిర్వహిస్తోంది. ఆగస్టు 21 నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ఈ ప్రత్యేక ప్రదర్శన కొనసాగనుంది. ‘ప్రతి ఆభరణంలోనూ కళ’ అనే భావనతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో విభిన్న డిజైన్లతో రూపొందించిన బంగారు ఆభరణాలు, వజ్రాభరణాలు, ముడి వజ్రాలతో రూపొందించిన ప్రత్యేక ఆభరణాలు, జాతిరత్నాభరణాలను ప్రదర్శనకు ఉంచారు. అత్యంత నైపుణ్యంతో రూపొందించిన ప్రతి ఆభరణం కళాకారుల సృజనాత్మకతకు, అనుభవానికి ప్రతీకగా నిలుస్తోంది. వివాహాలు, శుభకార్యాలు, వేడుకలు, ప్రత్యేక సందర్భాలకు అనువైన ధ్రువీకరించిన వజ్రాభరణాలతో పాటు ముడి వజ్రాలతో రూపొందించిన ప్రత్యేక ఆభరణాలు, జాతిరత్నాలతో తయారు చేసిన నగలు వినియోగదారులను ఆకట్టుకునేలా ఉన్నాయి. సంప్రదాయ హస్తకళను ప్రతిబింబించే డిజైన్లు, తేలికపాటి ఆధునిక ఆభరణాలు, భారతీయ సంప్రదాయ శైలిని ప్రతిబింబించే నగలు, చిన్నారుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఆభరణాలు కూడా ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. ‘ఆర్టిస్ట్రీ’ ప్రత్యేక ప్రదర్శన సందర్భంగా వినియోగదారులకు సంస్థ ప్రత్యేక రాయితీలను ప్రకటించింది. ముడి వజ్రాలు, జాతిరత్నాలతో కూడిన ఆభరణాల తయారీ రుసుముపై 30 శాతం వరకు తగ్గింపు అందిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ ప్రత్యేక అవకాశం సెప్టెంబర్ 14, 2026 వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారుల విశ్వాసానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ పారదర్శక ధరల విధానాన్ని సంస్థ అమలు చేస్తోందని ప్రతినిధులు తెలిపారు. ఆభరణాల తయారీ రుసుము, రాళ్ల బరువు, నికర బరువు, రాళ్ల విలువ తదితర వివరాలను స్పష్టంగా పేర్కొంటూ ధరల పట్టికను వినియోగదారులకు అందిస్తున్నట్లు వివరించారు. ఆభరణాల కొనుగోలు విషయంలో వినియోగదారులకు పూర్తి సమాచారం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాత బంగారు ఆభరణాలను తిరిగి విక్రయించే సమయంలో బంగారానికి పూర్తి విలువ చెల్లించడం, బంగారం మార్పిడిపై ఎలాంటి తగ్గింపు లేకపోవడం, వజ్రాభరణాల మార్పిడికి పూర్తి విలువ అందించడం వంటి సౌకర్యాలను సంస్థ కల్పిస్తోంది. అలాగే నూరు శాతం స్వచ్ఛతకు సంబంధించిన గుర్తింపు కలిగిన బంగారం, వజ్రాల నాణ్యతకు అంతర్జాతీయ ప్రమాణాల పరీక్షలు, జీవితకాల ఉచిత నిర్వహణ, తిరిగి కొనుగోలు హామీ వంటి సేవలను కూడా అందిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఆభరణాల నాణ్యతను వినియోగదారుల సమక్షంలో పరిశీలించేందుకు ప్రత్యేక పరికరాలను కూడా షోరూంలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. కొనుగోలుదారులు తాము ఎంపిక చేసుకునే ఆభరణాల నాణ్యత, స్వచ్ఛత, బరువు తదితర అంశాలను స్పష్టంగా తెలుసుకునే విధంగా పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. మలబార్ గ్రూప్‌కు చెందిన ప్రధాన సంస్థగా 1993లో కేరళలో ప్రారంభమైన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో విస్తరించింది. భారతదేశంతో పాటు ఆస్ట్రేలియా, కెనడా, బ్రిటన్, అమెరికా, మధ్యప్రాచ్య దేశాలు, తూర్పు ఆసియా తదితర ప్రాంతాల్లో సంస్థ వ్యాపార కార్యకలాపాలను నిర్వహిస్తోంది. ప్రస్తుతం 14 దేశాల్లో 450కి పైగా షోరూంలు, తయారీ కేంద్రాలతో విస్తృతమైన వ్యాపార నెట్‌వర్క్‌ను కలిగి ఉన్నట్లు సంస్థ తెలిపింది. అమలాపురం ప్రాంత ప్రజలకు విభిన్న రకాల ఆభరణాలను ఒకే వేదికపై చూసి, తమ అభిరుచికి, అవసరానికి అనుగుణంగా ఎంపిక చేసుకునే అవకాశం కల్పించడమే ‘ఆర్టిస్ట్రీ’ ప్రదర్శన ఉద్దేశమని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఆగస్టు 21 నుంచి 24వ తేదీ వరకు అమలాపురం మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో జరిగే ఈ ప్రత్యేక ప్రదర్శనను సందర్శించి, అందుబాటులో ఉన్న విభిన్న డిజైన్లను పరిశీలించాలని వారు కోరారు. ప్రత్యేక రాయితీలను వినియోగించుకుని తమకు నచ్చిన ఆభరణాలను ఎంపిక చేసుకోవాలని వినియోగదారులకు సూచించారు.

# అన్నవరం ఆర్టీసీ బస్టాండ్‌లో మంత్రి ఆకస్మిక తనిఖీ





**అన్నవరం, ఆగస్టు 21, విశ్వం వాయిస్ న్యూస్ :** అన్నవరం ఆర్టీసీ బస్టాండ్‌ను రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళా ప్రయాణికులతో మంత్రి నేరుగా మాట్లాడి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో అమలు చేస్తున్న 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు తీరుపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. పథకం అమలుతో మహిళలకు కలుగుతున్న ప్రయోజనాలపై పలువురు మహిళా ప్రయాణికులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. బస్టాండ్‌లో తాగునీరు, పారిశుధ్యం, కూర్చునే సదుపాయాలు తదితర మౌలిక వసతులపై మంత్రి ఆరా తీశారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సదుపాయాలను మెరుగుపరచాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం బస్టాండ్‌లోని క్యాంటీన్‌ను సందర్శించిన మంత్రి.. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బందితో కలిసి అల్పాహారం చేశారు. వారితో ఆత్మీయంగా మాట్లాడి, విధుల్లో ఎదురవుతున్న సమస్యలు, అవసరాలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ఆర్టీసీ సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు కల్పించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు.

# అన్నవరం స్వామిని దర్శించిన మంత్రి కొల్లు రవీంద్ర

**శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు - కొల్లు రవీంద్రకు వేద ఆశీర్వచనాలు**
**రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు - ఆధ్యాత్మిక కార్యక్రమంలో భక్తుల సందడి**



**అన్నవరం, ఆగస్టు 21, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర శ్రావణ శుక్రవారం సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా అన్నవరంలోని శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానాన్ని సందర్శించారు. ఆలయానికి చేరు కున్న మంత్రి స్వామివారిని దర్శిం చుకుని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. శ్రావణ మాసంలో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు విశేష ప్రాధాన్యం ఉండటంతో ఆలయంలో భక్తుల రద్దీ కనిపించింది. ఆలయ అధి కారులు, అర్చకులు మంత్రికి సంప్ర దాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక అర్చనలు నిర్వహించి ఆశీ స్సులు పొందారు. పూజా కార్యక్రమాలు వేద మంత్రోచ్చారణల మధ్య భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ స్వామివారి కృపాకటాక్షాలు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఐశ్వర్యం నెలకొనాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర పురోగతి కోసం స్వామివారి ఆశీస్సులు కోరినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు మంత్రికి ఆశీర్వచనాలు అందించారు. శాస్త్రోక్త పద్ధతిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు. స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించిన మంత్రి కొంతసేపు ఆలయ పరిసరాల్లో గడిపారు. శ్రావణ మాసం సందర్భంగా అన్నవరం దేవస్థానంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శన సౌకర్యాలు, ప్రసాదాల పంపిణీ, భద్రతా ఏర్పాట్లను పటిష్టం చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆధ్యాత్మిక సంప్రదాయాలను కాపాడుతూ ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా పలువురు భక్తులు అభిప్రాయపడ్డారు. శ్రావణ శుక్రవారం వేళ స్వామివారి దర్శనం చేసుకున్న మంత్రి కొల్లు రవీంద్ర రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం చేసిన ప్రార్థనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.


# 3వ రోజున అఖండ దీపారాధన దేదీప్యమానం చేసింది

**వరుణ యాగాన్ని సందర్శించిన కలెక్టర్, జిల్లా ప్రముఖులు**









**కోటనందూరు, ఆగస్టు 21, విశ్వం వాయిస్ న్యూస్ :** తీవ్ర వర్షాభావ పరిస్థితుల నుంచి జిల్లా రైతాంగాన్ని గట్టెక్కించిందేందుకు యనమల తలపెట్టిన వరుణ యాగం ఫలించి కొద్ది రోజుల్లోనే వరుణుడు కటాక్షించి సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు,ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ వర్మ ఆశాభావం వ్యక్తంచేశారు.ఇవాళ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వరుణయాగాన్ని సందర్శించారు. సాయంత్రం కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ వర్మ, జిల్లా టీడీపీ సీనియర్ నాయకులు పెంకే శ్రీనివాస బాబా,వైవీ దాస్,కర్రి వెంకట్రాజు వరుణయాగాన్ని సందర్శించి పుష్యంగ మహర్షికి పూజలు నిర్వహించారు. అన్నవరం దేవస్థానం తరుపున ఈవో చక్రధరరావు, లోవ దేవస్థానం తరుపున ఈవో విశ్వనాథ రాజు వరుణయాగాన్ని సందర్శించారు.

భుజం నొప్పికి చికిత్స కోసం

# కేరళకు పవన్ కల్యాణ్

**శస్త్రచికిత్స తర్వాత విశ్రాంతి పెద్దగా తీసుకోకుండా విధుల్లో చేరిక**
**భుజానికి వాపు, జ్వరం రావడంతో వైద్యుల సూచన**
**రేపు కేరళకు బయలుదేరనున్న ఉపముఖ్యమంత్రి**
**ఆయుర్వేద చికిత్సతో పూర్తిస్థాయిలో కోలుకోవడమే లక్ష్యం**



**ఆగస్టు 21, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రేపు కేరళకు పయనం కానున్నారు. తన భుజం నొప్పికి ఆయుర్వేద చికిత్స తీసు కునే నిమిత్తం ఆయన శనివారం కేరళకు వెళ్లనున్నట్లు జనసేన పార్టీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇటీవల పవన్ కల్యాణ్ తన కుడి భుజం 'రొటే టర్ కఫ్' గాయానికి ముంబైలో శస్త్రచికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే. శస్త్రచికిత్స అనంతరం కొంతకాలం పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని, అధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని వైద్యులు ఆయనకు సూచించారు. అయితే, పరిపాలనా బాధ్యతల దృష్ట్యా పవన్ కల్యాణ్ శస్త్రచికిత్స జరిగిన వారంలోపే తిరిగి విధుల్లో చేరారు. ముందస్తుగా నిర్ణయించిన ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు, శాఖాపరమైన సమీక్షలు, పార్టీ అంతర్గత సమావేశాలను ఆయన నిర్వహించారు. విశ్రాంతి లేకుండా విధుల్లో పాల్గొనడం వల్ల ఆయన భుజానికి వాపు రావడంతో పాటు తీవ్రమైన జ్వరం కూడా వచ్చినట్లు జనసేన పార్టీ పేర్కొంది. ఈ నేపథ్యంలో, భుజం నొప్పి నుంచి పూర్తిస్థాయిలో కోలుకోవడానికి కేరళలో ప్రత్యేక ఆయుర్వేద చికిత్స తీసుకోవాలని వైద్యులు సూచించగా, ఆయన రేపు అక్కడకు వెళ్లనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# ఘనంగా వరలక్ష్మి వ్రతం వేడుకలు

**కిటకిట లాడిన అమ్మవారి దేవాలయాలు**



**కోటనందూరు, ఆగస్టు 21, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా, కోట నందూరు మండలంలో వరలక్ష్మి వ్రతాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. శ్రావణమాసం రెండవ శుక్రవారాన్ని వరలక్ష్మీ వ్రతముగా ఆచరిస్తారు. వరలక్ష్మీ వ్రతం ఆచరించడం వలన మహిళలకు సౌభాగ్యం, సిరిసంపదలు, ఆయుష్షు ఆరోగ్యం ఎక్కువగా లభిస్తాయి అనే నమ్మకంతో ఈ వ్రతాన్ని మహిళలు ఆచరిస్తారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కాకరాపల్లి శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ చైర్మన్ వాసం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అర్చకుడు వేకువజామునే అమ్మవారికి పంచామృత అభిషేకములు, అలంకరణ, హారతి అనంతరము కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది మహిళలు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గుడివాడ శ్రీనుకు

# సీఎం సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం



**కోటనందూరు, ఆగస్టు 21, విశ్వం వాయిస్ న్యూస్ :** జగన్నాధపురం గ్రామానికి చెందిన గుడివాడ శ్రీను అనారోగ్యానికి గురై చికిత్స పొంది ఆరోగ్యంగా తిరిగి గ్రామానికి చేరుకున్నారు. గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకుడు మాతిరెడ్డి భాస్కరరావు సిఫార్సులు మేరకు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయగా ఎమ్మెల్యే యనమల దివ్య ఈరోజు గుడివాడ శ్రీను కుటుంబ సభ్యులకు మండల టిడిపి నాయకులు పోతల సూరిబాబు, పెంటకోట భాస్కర సత్యనారాయణ, అంకంరెడ్డి రమేష్, మాతిరెడ్డి భాస్కర రావుల సమక్షంలో 63,850 రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దివ్య మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి సీఎం సహాయనిధి ద్వారా ఆదుకున్నందుకు సంతోషంగా ఉందని, ప్రజా సమస్యలు ఇబ్బందులు నా దృష్టికి వస్తే తక్షణమే స్పందిస్తాన్ని ఈ సందర్భంగా తెలియజేశారు.

వరుణుడు కటాక్షం కోసం 3వ రోజు

# కొనసాగిన వరుణ యాగం

**కోటనందూరు, ఆగస్టు 21, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎలినో ప్రభావంతో చినుకు జాడలేక అల్లాడిపోతున్న సర్వ జీవులు, రైతాంగం క్షేమం కోసం వరుణ కటాక్షం కోసం యనమల గార్డెన్స్ లో జరుగుతున్న మహావరుణయాగం పూజాకార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుగుచున్నవి. ఇవాళ 3వ రోజు ఋత్వికుల వేదమంత్రాలతో అభిషేకాలు, యాగాలు,జలజపం వంటి వైదిక కార్యక్రమాలతో యనమల గార్డెన్స్ ఆద్యాత్మిక శోభతో పులకరించింది.రైతు బాంధవులుగా నిలిచి వర్షాల కోసం మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ విఫ్ యనమల దివ్య సంకల్పించిన మహా యజ్ఞంలో మేము సైతం అంటూ రైతుల భారీ సంఖ్యలో వరుణ యాగాన్ని సందర్శించారు. రాష్ట్రంలోనే తొలి సారిగా యనమల గార్డెన్స్ లో వరుణ యాగం మహానందంతో ఆద్యాత్మిక అనుభూతి కలిగిందని వరుణుడు కరుణిస్తాడు... వర్షాలు పడతాయని యాగంలో ఋత్వికులు నిర్వహించిన హోమాలు జల జపాలు, అభిషేకాలు వంటి పూజా కార్యక్రమాలు తిలకించిన తర్వాత రైతు ప్రతినిధులు ఆశాభావం వ్యక్తంచేశారు. సాయంత్రం జరిగిన నీరాజన, మంత్ర పుష్పాలు, చతుర్వేద స్వస్తితో ఋత్వికులు మూడవ రోజు వరుణయాగం పూజలకు ముగింపు పలికారు.ప్రభుత్వ విఫ్ యనమల దివ్య తల్లిదండ్రులు యనమల రామకృష్ణుడు విజయలక్ష్మీ దంపతులతో కలిసి పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు.




**మండపేట టౌన్, ఆగస్టు 21, విశ్వంవాయిస్ న్యూస్ :** మున్సిపల్ ఎన్నికలు అంటే రాష్ట్రమంతా ఒక ఎత్తు మండపేట మున్సిపాలిటీ ఎన్నికలు మరొక ఎత్తు అని తెలిసిందే.

మండపేట పురపాలక సంఘ కౌన్సిల్ పదవీకాలం మార్చి నెలతో ముగియడంతో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో మండపేట మున్సిపల్ చైర్మన్ పీఠం ఓ సి సామాజిక వర్గానికా లేక మరలా బీసీ సామాజిక వర్గానికి మొగ్గు చూపుతుందా లేదంటే ఇప్పటివరకు ఎప్పుడూ నోచుకొని ఎస్ సి, ఎస్ టి సామాజిక వర్గాలకు నోచుకుంటుందా అని పురప్రజలందరూ చర్చించుకుంటున్న ప్రధాన అంశంగా ఉంది. మండపేట మున్సిపాలిటీని పరిశీలిస్తే ఎప్పుడూ లేనంత వేడిని పుట్టించిన 2014 మున్సిపాలిటీ ఎన్నికల్లో చైర్మన్ పీఠం ఓపెన్ కేటగిరీ కావడంతో తెలుగుదేశం వైఎస్ఆర్సీపీ ఇరు పార్టీల నుండి కమ్మ సామాజిక వర్గం వారే పోటీ పడ్డారు. అప్పట్లో ఈ ఎన్నికలు రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశం అయింది. అదే సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా వరుస విజయాలతో దూసుకు వెళ్తున్న వేగుళ్ళ జోగేశ్వరరావు తనదైన సరళిలో రాజకీయ అనుభవాన్ని రంగరించి తెలుగుదేశం పార్టీ విజయకేతనం ఎగురవేయడానికి అందరినీ ఒక తాటిపై తీసుకువచ్చి కీలకంగా వ్యవహరించారు. దివంగత నేత చంద్రు శ్రీ వర ప్రకాష్ చైర్మన్ పీఠాన్ని అవరోధించారు. వీరి పదవీకాలం ముగిసిన అనంతరం 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైయస్సార్ పార్టీ ప్రజాధారణతో అధికారం చేపట్టిన అనంతరం 2020 సంవత్సరం మార్చి నెలలో మున్సిపాలిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కాగా చైర్మన్ పీఠం బీసీ సామాజికవర్గానికి రిజర్వుడైయింది. ఆనాడు మున్సిపల్ చైర్మన్ పీఠానికి కీలక ఇరు పార్టీల నుండి బీసీ సామాజిక వర్గ మహిళలే పోటీ పడ్డారు. అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియలు ముగిసిన అనంతరం ఆ సమయంలో కరోనా మహమ్మారి విజృంభించడంతో ఎన్నికలు తాత్కాలిక వాయిదా పడ్డాయి. కొన్ని రాజకీయ అనూహ్య మార్పుల చేర్పులతో మండపేట వైయస్సార్ పార్టీ ఇన్చార్జిగా తోట త్రిమూర్తులు వచ్చారు. వాయిదా పడ్డ ఎన్నికలు 2021 సంవత్సరంలో జరిగాయి. జగన్మోహన్ రెడ్డి నవరత్న పథకాలు తోట త్రిమూర్తులు చరిష్మాతో ఆ ఎన్నికల్లో వైయస్సార్ పార్టీ మొత్తం 22 వార్డులు కైవసం చేసుకుని ఎప్పుడులేని విధంగా తెలుగుదేశం పార్టీని 6వార్డులకు పరిమితం చేశారు ఓటర్లు. చైర్మన్ పీఠాన్ని బీసీ మహిళ పతివాడ నూక దుర్గారాణి అధిరోహించారు. గడిచిన మార్చి నెలతో వీరి పదవీకాలం ముగియడంతో మండపేట పురవీధుల్లో ప్రజలందరి నోట రాబోయే ఎన్నికల్లో చైర్మన్ పీఠం బీసీ లేక ఓసి సామాజిక వర్గాలకి కేటాయిస్తారు అని చర్చించుకుంటున్నారు. ఓసి సామాజిక వర్గానికి కేటాయిస్తే టీడీపీ ఇంచార్జ్ కమ్మ వైసీపీ ఇంచార్జ్ కాపు సామజిక వర్గాలకు చెందినవారు కనుక పోటీలో అదే సామాజిక వర్గాల వారు అయితే ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటారని రాజకీయ విశ్లేషకులు విశ్లేషణ. తెలుగుదేశం పార్టీకి రాబోయే మున్సిపాలిటీ ఎన్నికలలో 36 వార్డులో అనుచరగనం గల నాయకుడిగా తెలుగుదేశం పార్టీ విజయానికి కీలకంగా వ్యవహరించే ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావుకు కుడి భుజంగా ఉండే చుంద్రు శ్రీ వర ప్రకాష్ ఆకాల మరణంతో పార్టీకి తీరని లోటుగా ఏర్పడింది. దీంతో 36 వార్డుల బాధ్యత జోగేశ్వరరావు పై పడింది. ప్రకాష్ లేని లోటును వేగుళ్ల ఏ విధంగా భర్తీ చేస్తారు వేచి చూడాల్సి ఉంది. ఈ ఎన్నికల్లో అధికార కూటమి పార్టీ వైఫల్యాలను చూపిస్తూ గెలుపు దిశగా ప్రయాణించాలని ప్రతిపక్ష వైసిపి భావిస్తూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంటే, తాము చేసిన అభివృద్ధి గెలుపు తీరాలకు చేర్చుతుందని కూటమి నాయకులు గెలుపు పై ధీమాగా ఉన్నారు. ఏది ఏమైనా సరే ఎన్నికల నోటిఫికేషన్ విడుదలై రిజర్వేషన్ ఖరారు అయ్యేంతవరకు ఈ సందిగ్ధత కొనసాగుతూ ఉంటుందని పుర ప్రముఖులు అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నారు.






**గోకవరం, ఆగస్టు 21, విశ్వంవాయిస్ న్యూస్ :** దేవిచౌక్ సమీపంలోని అరవపేటలో పారిశుధ్య పరిస్థితులు రోజురోజుకూ అధ్వానంగా మారుతున్నాయి. డ్రైనేజీలు మురుగుతో నిండిపోవడంతో మురుగునీరు సీసీ రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో పరిసర ప్రాంతాల్లో దోమల బెడద తీవ్రంగా పెరిగి, స్థానికులు డెంగ్యూ, ఇతర సీజనల్ వ్యాధుల భయంతో ఆందోళన చెందుతున్నారు. స్థానికుల సమాచారం ప్రకారం గత వారం రోజులుగా పలువురు జ్వరాలతో బాధపడుతున్నారు. కొందరికి ప్లేట్లెట్ల సంఖ్య తగ్గుతున్నట్లు చెబుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోతున్నారు. ఇళ్ల మధ్య, రహదారి పక్కన చెత్తాచెదారం, తుప్పలు పేరుకుపోవడంతో దోమలు వృద్ధి చెందేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని స్థానికులు పేర్కొంటున్నారు. మురుగునీరు రోడ్లపై నిలిచి ఉండటంతో దుర్వాసనతో పాటు ప్రజలు రాకపోకలకు కూడా ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య సిబ్బంది క్రమం తప్పకుండా డ్రైనేజీలను శుభ్రం చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పరిస్థితి మరింత విషమించకముందే అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు. అధికారులు తక్షణ చర్యలు చేపట్టి డ్రైనేజీలను పూర్తిస్థాయిలో శుభ్రం చేయడంతో పాటు, నిల్వ ఉన్న మురుగునీటిని తొలగించి, ఇళ్ల మధ్య పేరుకుపోయిన చెత్తాచెదారం, తుప్పలను తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. దోమల నివారణకు ఫాగింగ్, యాంటీ లార్వా చర్యలు చేపట్టి, జ్వరాలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజారోగ్యానికి సంబంధించిన సమస్య కావడంతో అధికారులు వెంటనే అరవపేటను పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఆలయాల అభివృద్ధికి శ్రీవాణి ట్రస్ట్ ద్వారా

# రూ. 45 లక్షలు మంజూరు

## ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు



**మండపేట టౌన్, ఆగస్టు 21, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట నియోజకవర్గ పరిధిలోని పలు దేవాలయాల పున:నిర్మాణం, నూతన నిర్మాణాల కోసం శ్రీవాణి ట్రస్ట్ ద్వారా మొత్తం రూ 45.00 లక్షల నిధులు మంజూరైనట్లు రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఆలయాలను పునరుద్ధరించడానికి, ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించడానికి ఈ నిధులు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ నిధుల కేటాయింపులో భాగంగా రాయవరం మండలం పసలపూడి గ్రామంలోని చింతాలమ్మ అమ్మవారి దేవస్థానం పున:నిర్మాణానికి రూ 10.00 లక్షలు, పసలపూడి ఎస్సి ఏరియాలో నూతనంగా నిర్మించనున్న రామాలయం కోసం రూ 15.00 లక్షలు, అలాగే మండపేట పట్టణంలో పోలేరమ్మ అమ్మవారి దేవస్థాన నిర్మాణ పనుల కొరకు రూ 20.00 లక్షల నిధులు శ్రీవాణి ట్రస్ట్ ద్వారా మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ మాట్లాడుతూ మన ప్రాంతంలో ఉన్న పురాతన ఆలయాల పునరుద్ధరణకు, నూతన ఆలయాల నిర్మాణానికి శ్రీవాణి ట్రస్ట్ ద్వారా సహకారం అందడం చాలా సంతోషకరమని అన్నారు. మంజూరైన నిధులతో నిర్మాణ పనులన్నీ త్వరితగతిన పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, దేవాదాయ శాఖా మాత్యులు ఆనం రామనారాయణరెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

ప్రజా సంక్షేమం

# కూటమితోనే సాధ్యం

## ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు



**కపిలేశ్వరపురం, ఆగస్టు 21, విశ్వంవాయిస్ న్యూస్ :** అభివృద్ధి,ప్రజ సంక్షేమం కూటమి ప్రభుత్వం తోనే సాధ్యం అని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు.రెండేళ్ల పాలనలో అభివృద్ధి – సంక్షేమం" ఇంటింటా ప్రచార కార్యక్రమంలో భాగంగా కపిలేశ్వరపురం మండలం, తాతపూడి గ్రామంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు శుక్రవారం కూటమి నాయకులతో కలసి పర్యటించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ స్వయంగా వెళ్లి కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు వివరించారు. ఈ మేరకు ప్రత్యేకంగా ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జగ్గంశెట్టి సత్యనారాయణ, కాలదాసి రాజు, మేక ప్రసాద్, మేక శ్రీధర్, గుత్తుల శ్రీనివాస్, కొప్పిశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుడాల జయబాబు, రాష్ట్ర కుమ్మరి సాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ మాచవరపు విజయకుమారి, అమలాపురం పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు ముత్యాల వెంకట్రావు, కపిలేశ్వరపురం మండల టీడీపీ అధ్యక్షులు బలవరెడ్డి సత్తిబాబు, మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మా 'విశ్వం వాయిస్' వాట్సాప్ ఛానల్‌లో జాయిన్ అవ్వండి!
నిజాయితీ గల వార్తలు.. నిరంతర అప్‌డేట్స్!
• ⚡ బ్రేకింగ్ న్యూస్ అప్‌డేట్స్
• రోజువారీ తెలుగు దినపత్రిక PDF
• అంతర్జాతీయ, జాతీయ వార్తలు
• విశ్లేషణాత్మక కథనాలు
VISWAM VOICE BREAKING NEWS
WhatsApp channel
మీ ఫోన్ కెమెరాతో స్కాన్ చేసి గ్రూపులో చేరండి
JOIN NOW
లింక్ ద్వారా కూడా జాయిన్ అవ్వండి:
https://whatsapp.com/channel/0029Va7zLL1E50Uhr9gpAR1E
మాతో పాటు మరిన్ని వార్తలు మరియు తాజా అప్‌డేట్స్ తెలుసుకోండి.



న్యాచురల్ స్టార్ నాని ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా ది ప్యారడైజ్. దసరా సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో నాని జోడిగా అందాల భామ కయాదు లోహర్ కథానాయికగా నటిస్తుంది. నేచురల్ స్టార్ నాని ప్రస్తుతం ప్యారడైజ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతున్నాడు. నాని సినిమా కోసం ఆడియన్స్ ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు. నాని సినిమాలకు మినిమమ్ గ్యారెంటీ ఉంటుంది. ఫ్యామిలీ మొత్తం వెళ్లి చూసి ఎంజాయ్ చేసేలా ఉంటాయి. అది ఏ జోనర్ సినిమా అయినా నాని సినిమా అంటే చాలు ఫ్యాన్ థియేటర్స్ కు క్యూ కడతారు. ఇక దసరాలాంటి మాస్ మసాలా సినిమా తర్వాత హాయ్ నాన్నలాంటి ఫ్యామిలీ సినిమాతో కట్టిపడేసాడు. తర్వాత సరిపోదా శనివారం, హిట్ 3 సినిమాలతో హిట్స్ అందుకున్నారు. నాని ఆతర్వాత ఇక ఇప్పుడు ప్యారడైజ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతుంది ఈ సినిమా. నాని, సోనాలి కులకర్ణి, మోహన్ బాబు, రాఘవ్ జుయల్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, బెంగాలీ భాషల్లో రిలీజ్ చేయనున్నారు. ఇక ఈ సినిమాలో నాని జోడిగా కయాదు లోహర్ కథానాయికగా నటిస్తుంది. అయితే కొన్ని రోజులుగా ఈ సినిమా గురించి ఆసక్తికర విషయాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ పాట కోసం ముందుగా తమన్నాను అనుకున్నప్పటికీ.. అనుహ్యంగా ఆతర్వాత మరో హీరోయిన్ పేరు తెరపైకి వచ్చింది ఆ ముద్దుగుమ్మే పూజా హెగ్డే. కానీ ఇప్పుడు మరో హీరోయిన్ పేరు వినిపిస్తుంది. ఆమె ఎవరో కాదు కీర్తిసురేష్. ది ప్యారడైజ్ సినిమాలో స్పెషల్ సాంగ్ చేసేందుకు కీర్తిసురేష్ సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని టాక్. గతంలో నేను లోకల్, దసరా సినిమాల్లో కీర్తిసురేష్ నానికి జోడీగా నటించింది. ఇక ఇప్పుడు ఈ అమ్మడు ప్యారడైజ్ సినిమాలో స్పెషల్ సాంగ్ చేస్తుందని ప్రచారం జరుగుతుంది. ఈవార్తల్లో వాస్తవం ఎంత అన్నది తెలియాల్సి ఉంది. త్వరలోనే దీనిపై త్వరలోనే క్లారిటీ రానుంది.




## అప్పుడు టీవీ ఛానెల్ యాంకర్.. ఇప్పుడు కోట్ల ఆస్తులకు యువరాణి, సొంత దీవి కూడా ఉంది



సినిమా గ్లామర్ ప్రపంచంలో ఆమె టాప్ హీరోయిన్లలో ఒకరు. నటనపై ఆసక్తితో ముందుగా మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టిన ఈ అమ్మడు.. ఇప్పుడు బాలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీలలలో దూసుకుపోతుంది. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాల మధ్య పెరిగిన ఆమె.. జర్నలిజం చదువు పూర్తి చేసింది. ఆ తర్వాత కొన్నాళ్లపాటు ఓ ఛానల్లో రిపోర్టర్ గా జాబ్ చేసింది. సినిమా గ్లామర్ ప్రపంచంలో ఆమె టాప్ హీరోయిన్లలో ఒకరు. నటనపై ఆసక్తితో ముందుగా మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టిన ఈ అమ్మడు.. ఇప్పుడు బాలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీలలలో దూసుకుపోతుంది. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాల మధ్య పెరిగిన ఆమె.. జర్నలిజం చదువు పూర్తి చేసింది. ఆ తర్వాత కొన్నాళ్లపాటు ఓ ఛానల్లో రిపోర్టర్ గా జాబ్ చేసింది. కానీ నటనపై ఆసక్తి ఉన్న ఆమె.. న్యూస్ రూమ్ నుంచి చలనచిత్ర పరిశ్రమ వైపు అడుగులు వేసేలా చేసింది. ఇప్పుడు సొంతంగా ఐల్యాండ్ , కోట్ల ఆస్తి ఉన్న హీరోయిన్ ఆమె. ఆ హీరోయిన్ మరెవరో కాదండి. జాక్వెలిన్ ఫెర్నాండెజ్. జాక్వెలిన్ తండ్రి శ్రీలంకకు చెందినవారు. తల్లి మలేషియా. ఆమె బహ్రెయిన్‌లోని మనామాలో జన్మించారు. చిన్నప్పటి నుంచే విభిన్న సంస్కృతి, సంప్రదాయల మధ్య పెరిగింది. సిడ్నీ విశ్వవిద్యాలయం నుండి మాస్ కమ్యూనికేషన్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి శ్రీలంకకు తిరిగి వచ్చింది. అక్కడ ఆమె టెలివిజన్ రిపోర్టర్‌గా, లంక బిజినెస్ రిపోర్ట్ షోకు యాంకర్‌గా పనిచేసింది. 2006లో లాస్ ఏంజిల్స్‌లో జరిగిన మిస్ యూనివర్స్ పోటీలో తన దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ మిస్ యూనివర్స్ శ్రీలంక కిరీటాన్ని గెలుచుకుంది. ఆ తర్వాత 2009లో సుజోయ్ ఘోష్ దర్శకత్వంలో వచ్చిన అలాడిన్ అనే ఫాంటసీ డ్రామాతో బాలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఫస్ట్ మూవీతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. దీంతో ఆమె ఐఫా స్టార్ డెబ్యూ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకుంది. 2011లో వచ్చిన సైకలాజికల్ థ్రిల్లర్ మర్డర్ 2 మూవీతో ఆమె కెరీర్ ఒక్కసారిగా మారిపోయింది. హౌస్‌ఫుల్ 2, రేస్ 2, కిక్ వంటి చిత్రాలతో హిట్లు అందుకుంది. జాక్వెలిన్ ఎక్కువగా స్పెషల్ పాటలతో ఫేమస్ అయ్యింది. అలాగే శ్రీలంకలో సొంతంగా ద్వీపం కొనుగోలు చేసిందట. ప్రస్తుతం బాలీవుడ్ లో వరుసగా సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా ఉంది. ముంబైలో జాక్వెలిన్‌కు 5 బిహెచ్‌కె అపార్ట్‌మెంట్ కూడా ఉందని టాక్. జాక్వెలిన్ ఫెర్నాండెజ్ 2009లో అల్లాదీన్ చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. కెరీర్ బిగినింగ్ లో ఓ టీవీ ఛానెల్‌లో యాంకర్‌గా చేసింది. హౌస్‌ఫుల్, మర్డర్ 2, కిక్ , రేస్ 2తో సహా 35కి పైగా చిత్రాలలో నటించింది. ఇక సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ ముద్దుగుమ్మ తన గ్లామరస్ ఫోటోలతో ప్రేక్షకులను కవ్విస్తుంది. రకరకాల ఫోటోలు వీడియోలు షేర్ చేస్తూ ఆకట్టుకుంటుంది.

# చెప్పి మరీ చిత్తుగా ఓడించారుగా..! ఇంగ్లాండ్ వర్సెస్ పాక్ తొలి టెస్ట్ ఫలితమిదే..

తొలి టెస్టులో పాకిస్థాన్‌పై ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 103 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మూడు రోజులకంటే తక్కువ సమయంలోనే మ్యాచ్‌ను ముగించింది. పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 171, రెండో ఇన్నింగ్స్‌లో 135 పరుగులకే ఆలౌటైంది. ఇంగ్లండ్ 409 పరుగులు చేసి 238 పరుగుల ఆధిక్యం సాధించింది.

**తొలి ఇన్నింగ్స్‌లో పాక్ 171**

మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 171 పరుగులకే ఆలౌటైంది. అబ్దుల్లా షఫీక్ మాత్రమే అర్ధశతకం సాధించి 61 పరుగులు చేశాడు. ఇంగ్లండ్ బౌలర్లలో ఓలీ రాబిన్సన్ అద్భుతంగా బౌలింగ్ చేసి ఐదు వికెట్లు పడగొట్టాడు. జోష్ టంగ్ కూడా పాక్ బ్యాటింగ్ లైనప్‌ను తీవ్రంగా ఇబ్బంది పెట్టాడు.

**ఇంగ్లండ్ భారీ స్కోరు**

అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 409 పరుగుల భారీ స్కోరు సాధించింది. దీంతో పాకిస్థాన్‌పై ఏకంగా 238 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఇంగ్లండ్ బ్యాటర్లు సమష్టిగా రాణించడంతో భారీ స్కోరు నమోదైంది. వైస్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ అద్భుత బ్యాటింగ్‌తో జట్టును ముందుండి నడిపించాడు. 93 బంతుల్లో 91 పరుగులు చేసిన అతడు 13 బౌండరీలు బాదాడు.

క్రీడా వాయిస్
మీ క్రీడా వార్తల స్వరము



జోర్డాన్ కాక్స్ 73, కొత్త టెస్టు కెప్టెన్ జో రూట్ 66, డాన్ లారెన్స్ 51 పరుగులతో అర్ధశతకాలు సాధించారు. పాకిస్థాన్ బౌలర్లలో అలీ ఉస్మాన్ ఐదు వికెట్లు పడగొట్టి ఇంగ్లండ్ భారీ స్కోరును కొంతమేర అడ్డుకున్నాడు.


**రెండో ఇన్నింగ్స్‌లోనూ పాక్ పతనం**

238 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్థాన్ బ్యాటింగ్ మరోసారి కుప్పకూలింది. షాన్ మసూద్ 29, అబ్దుల్లా షఫీక్ 15, సౌద్ షకీల్ 14, మహమ్మద్ రిజ్వాన్ 41 పరుగులతో కొంతసేపు పోరాడినా.. ఎవరూ భారీ ఇన్నింగ్స్ ఆడలేకపోయారు. చివరకు పాక్ 135 పరుగులకే ఆలౌటైంది.

**టంగ్, రాబిన్సన్ దెబ్బ**

ఇంగ్లండ్ విజయానికి జోష్ టంగ్, ఓలీ రాబిన్సన్ కీలకంగా నిలిచారు. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీసిన టంగ్.. రెండో ఇన్నింగ్స్‌లో మరో మూడు వికెట్లు పడగొట్టి మ్యాచ్‌లో మొత్తం ఎనిమిది వికెట్లు సాధించాడు. రాబిన్సన్ కూడా మ్యాచ్‌లో ఎనిమిది వికెట్లు తీసుకున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో జోఫ్రా ఆర్చర్ మూడు వికెట్లు పడగొట్టాడు. మొత్తంగా బ్యాటింగ్, బౌలింగ్ రెండు విభాగాల్లోనూ ఆధిపత్యం ప్రదర్శించిన ఇంగ్లండ్.. మూడు రోజులకంటే తక్కువ సమయంలోనే టెస్టును ముగించి 1-0 ఆధిక్యం సాధించింది. ఇక మిగిలిన రెండు టెస్టుల్లోనైనా పాకిస్థాన్ పుంజుకుంటుందా అనేది ఆసక్తికరంగా మారింది. అయితే ఈ మ్యాచ్ జరుగుతుండగానే ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ స్టువర్ట్ బ్రాడ్ పాకిస్థాన్‌ను సింపుల్‌గా ఓడిస్తాం అంటూ విమర్శించారు. బ్రాడ్ చెప్పినట్లే ఇంగ్లాండ్ పాక్‌ను చాలా చిత్తుగా ఓడించింది.

# ఒకటి, రెండు కాదు.. ఏకంగా సచిన్ 3 రికార్డులపై కన్నేశాడుగా..



టెస్టు క్రికెట్ చరిత్రలో తిరుగులేని బ్యాటర్‌గా కొనసాగుతున్న ఇంగ్లండ్ మాజీ సారథి జో రూట్ అరుదైన ఘనత దిశగా అడుగులు వేస్తున్నారు. పాకిస్తాన్‌తో లీడ్స్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో సాధించిన హాఫ్ సెంచరీతో భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ సరసన నిలవడమే కాకుండా, తదుపరి ఇన్నింగ్స్‌లో ఏకంగా మూడు రికార్డులను అధిగమించే సువర్ణావకాశాన్ని దక్కించుకున్నారు. పాకిస్తాన్‌తో జరుగుతున్న మూడు టెస్టుల సిరీస్‌లో భాగంగా హెడింగ్లే మైదానంలో ప్రారంభమైన తొలి టెస్టులో జో రూట్ అద్భుత బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్, పాకిస్తాన్‌ను తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 171 పరుగులకే కట్టడి చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య జట్టు బెన్ డకెట్, ఎమిలియో గే వికెట్లను త్వరగానే కోల్పోయి కాస్త తడబడింది. ఈ క్లిష్ట సమయంలో క్రీజులోకి వచ్చిన రూట్, జోర్డాన్ కాక్స్‌తో కలిసి మూడో వికెట్‌కు ఏకంగా 150 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ క్రమంలో రూట్ తన కెరీర్‌లో 68వ టెస్టు అర్ధ సెంచరీని పూర్తి చేసి, టెస్టు క్రికెట్‌లో అత్యధిక హాఫ్ సెంచరీలు సాధించిన బ్యాటర్‌గా సచిన్ టెండూల్కర్ (68) పేరిట ఉన్న ఆల్‌టైమ్ రికార్డును సమం చేశారు.

**టెస్టుల్లో అత్యధిక అర్ధ సెంచరీల రికార్డు అధిగమించే అవకాశం..**

సుదీర్ఘ ఫార్మాట్‌లో సచిన్ రికార్డులను బద్దలు కొట్టే దిశగా సాగుతున్న జో రూట్, టెస్టు చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలవడానికి ఇంకా 1742 పరుగుల దూరంలో ఉన్నారు. అయితే తర్వాతి ఇన్నింగ్స్‌లోనే ఆయన సచిన్‌కు సంబంధించిన మూడు కీలక గణాంకాలను దాటేసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. మొదటిది, టెస్టుల్లో అత్యధిక అర్ధ సెంచరీల రికార్డు. ప్రస్తుతం సచిన్, రూట్ ఇద్దరూ చెరో 68 హాఫ్ సెంచరీలతో సమఉజ్జీలుగా ఉన్నారు. రాబోయే ఇన్నింగ్స్‌లో రూట్ మరో అర్ధ శతకం నమోదు చేస్తే, సచిన్‌ను వెనక్కి నెట్టి టెస్టు క్రికెట్ చరిత్రలోనే అత్యధిక అర్ధ సెంచరీలు సాధించిన ఏకైక బ్యాటర్‌గా నయా చరిత్ర లిఖిస్తారు.

టెస్టుల్లో అత్యధిక హాఫ్ సెంచరీలు:
సచిన్ టెండూల్కర్ (భారత్) - 68
జో రూట్ (ఇంగ్లండ్) - 68

పాకిస్తాన్‌పై సెంచరీల లెక్కల్లో ముందంజ..

పాకిస్తాన్‌పై టెస్టుల్లో 1000కి పైగా పరుగులు చేసిన బ్యాటర్లలో సచిన్, రూట్ ఇద్దరూ ఉన్నారు. సచిన్ 42.28 సగటుతో 1057 పరుగులు చేయగా, జో రూట్ 32 ఇన్నింగ్స్‌లలో 1553 పరుగులు సాధించారు. అయితే, పాక్‌పై టెస్టు సెంచరీల విషయంలో ఇద్దరూ సమానంగా చెరో 2 శతకాలు నమోదు చేశారు. ఈ జాబితాలో కుమార సంగక్కర 10 సెంచరీలతో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ఒకవేళ రూట్ తన తదుపరి ఇన్నింగ్స్‌లో సెంచరీ సాధిస్తే, పాకిస్తాన్‌పై టెస్టు శతకాల సంఖ్యలో సచిన్‌ను వెనక్కి నెట్టి ముందంజ వేస్తారు.

**స్వదేశంలో పాక్‌పై యాభైకి పైగా స్కోర్ల రికార్డు..**

స్వదేశంలో పాకిస్తాన్‌పై అన్ని ఫార్మాట్లలో కలిపి అత్యధిక 50o స్కోర్లు చేసిన రికార్డు కేన్ విలియమ్సన్ (4 సెంచరీలు, 9 హాఫ్ సెంచరీలు) పేరిట ఉంది. భారత్ తరపున సునీల్ గవాస్కర్ తర్వాత స్వదేశంలో పాక్‌పై ఎక్కువ 50o స్కోర్లు చేసిన రికార్డు సచిన్ పేరిట ఉంది.ప్రస్తుతం స్వదేశంలో పాకిస్తాన్‌పై 50కి పైగా పరుగులు సాధించిన సందర్భాల్లో రూట్, సచిన్ సమానంగా ఉన్నారు. ఇద్దరూ సరిగ్గా 29 ఇన్నింగ్స్‌లలో 10 సార్లు యాభైకి పైగా స్కోర్లు (2 సెంచరీలు, 8 హాఫ్ సెంచరీలు) నమోదు చేయడం విశేషం. రాబోయే ఇన్నింగ్స్‌లో రూట్ మరోసారి 50 మార్కును అందుకుంటే, స్వదేశంలో పాక్‌పై అత్యధిక 50o స్కోర్లు చేసిన ఆటగాళ్ల జాబితాలోనూ సచిన్ టెండూల్కర్‌ను అధిగమిస్తారు. టెస్టు క్రికెట్‌లో నిలకడకు మారుపేరుగా నిలుస్తున్న జో రూట్ తన సూపర్ ఫామ్‌తో సరికొత్త రికార్డులను తిరగరాస్తున్నారు. పాకిస్తాన్‌తో జరిగే తదుపరి ఇన్నింగ్స్‌లో బ్యాట్ ఝుళిపిస్తే, దిగ్గజ బ్యాటర్ సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న ఈ మూడు మైలురాళ్లు అధికారికంగా రూట్ ఖాతాలోకి చేరడం ఖాయంగా కనిపిస్తోంది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com